సీఎం చంద్రబాబు రంజాన్ శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): ముస్లిం సోదర సోదరీమణులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో ముగిసింది. జకాత్ పేరుతో సాటి వారిని ఆదుకునే దయా గుణం ముస్లిం వర్గంలోని మానవత్వానికి ప్రతిరూపం. పేద కుటుంబాల సముద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అల్లా దయవల్ల విజయవంతం కావాలని కోరుకుంటూ.. అందరికీ పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.

పేదలను ఆదుకునే మిషన్ పీ-4

సమాజంలో గేమ్ ఛేంజర్

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన



- వివరాలు 2,3లో...

- నేను అనుకున్న ఏ ప్రణాళికా ఫెయిల్ అవ్వలేదు
- ఉగాది రోజున ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతమవుతుంది
- ఎన్టీఆర్ స్ఫూర్తితో 47 ఏళ్ళుగా ప్రజా సేవలో ఉన్నా
- నా జీవితం ప్రజలకు అంకితం..
- సుపరిపాలన, మంచి రాజకీయాలనే నమ్మాను
- పని చేయడం తప్ప మరొకటి తెలీదు
- పీ-4 కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలను అభినందిస్తున్నా
- పేదరికం రూపుమాపడమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమం ప్రారంభం
- లోగోను ఆవిష్కరించిన సీఎం, డిప్యూటీ సీఎం

పేదల కోసం..!



- ❑ ఉగాది రోజు సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం
- ❑ రూ.38 కోట్ల సహాయ నిధి ఫైలుపై సంతకం
- ❑ 3,456 మంది పేదలకు లబ్ధి
- ❑ ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.281 కోట్లు విడుదల

అమరావతి (చైతన్యరథం): తెలుగు సంవత్సరాది తొలిరోజు ఉగాది సందర్భంగా పేదల జీవితాల్లో వెలుగు నింపేలా సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. పేదల ఆరోగ్య సంరక్షణకు సాయం అందించేలా, వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఫైలుపై తెలుగు కొత్త సంవత్సరంలో తొలి సంతకం చేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.38 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపారు. దీంతో 3,456 మంది పేదలకు లబ్ధి కలుగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటివరకు 23,418 మంది పేదలకు రూ.281.38 కోట్లను ప్రభుత్వం అందించింది.

నా జీవితాశయం..

పేదరికం లేని సమాజం

- ❑ ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ❑ ప్రజల జీవితాల్లో ఉగాది వెలుగులు నింపాలి
- ❑ గత ప్రభుత్వంలో అందరికీ అవమానాలే
- ❑ ఇక వచ్చే ఐదేళ్లూ అందరికీ రాజపూజ్యం
- ❑ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న సీఎం
- ❑ వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి కళారత్న, ఉగాది అవార్డుల ప్రదానం

4



పండుగలు మన సంస్కృతిలో భాగం

- సమాజ బాగు కోసం తపనపడే వ్యక్తి వెంకయ్యనాయుడు
- ట్రస్ట్ నడపడం అంటే సాధారణ విషయం కాదు
- స్వర్ణ భారత్ ట్రస్ట్ యువతలో స్ఫూర్తి నింపుతోంది
- విలువలు లేనివారితో పోరాడుతున్నందుకు ఆవేదనగా ఉంది
- స్వర్ణభారత్ ట్రస్ట్ ఉగాది సంబరాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

7

ఐసీసీ చైర్మన్ జైషాతో కలిసి

విశాఖలో ఐపీఎల్ మ్యాచ్ వీక్షించిన మంత్రి లోకేష్

8

అలా.. తెలుగుఖ్యాతి విశ్వవ్యాప్తమైంది

5

43ఏళ్ల టీడీపీ ఉజ్వల చరిత్ర-గుణపాఠాలు -1

ఏఐ స్టార్టప్ నెలకొల్పి స్ఫూర్తిగా నిలిచావు

- దివ్యాంగ విద్యార్థి రఘునాథరెడ్డిని అభినందించిన మంత్రి లోకేష్
- మంత్రి చొరవతో గతంలో ఎన్ఐటీ కాలికట్‌లో సీటు పొందిన విద్యార్థి
- ఇంటర్ ధృవపత్రంలో తప్పును సరిదిద్ది గతంలో 25 మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్ కాపాడిన మంత్రి లోకేష్

9

పేదలను ఆదుకునే మిషన్ పీ-4

సమాజంలో గేమ్ ఛేంజర్

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- నేను అనుకున్న ఏ ప్రణాళికా ఫెయిల్ అవ్వలేదు
- ఉగాది రోజున ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతమవుతుంది
- ఎన్టీఆర్ స్ఫూర్తితో 47 ఏళ్ళుగా ప్రజా సేవలో ఉన్నా
- నా జీవితం ప్రజలకు అంకితం..
- సుపరిపాలన, మంచి రాజకీయాలనే నమ్మాను
- పని చేయడం తప్ప మరొకటి తెలీదు
- పీ-4 కార్యక్రమంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలను అభినందిస్తున్నా
- ఎదరికం రూపుమాపడమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమం ప్రారంభం
- లోగోను ఆవిష్కరించిన సీఎం, డిప్యూటీ సీఎం

అమరావతి (చైతన్యరథం): పేదలను ఆదుకునే మిషన్ పీ-4 అని, సమాజంలో ఈ కార్యక్రమం గేమ్ ఛేంజర్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. పీ-4 ఒక మహత్తర కార్యక్రమం అని, చరిత్ర సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఉగాది పర్వదినం రోజున ఆదివారం రాజధాని అమరావతిలో పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్షిప్‌గా ఈ విధానాన్ని తీసుకొచ్చారు. తొలి దశలో దాదాపు 20 లక్షల మందికి లబ్ది చేకూరేలా ప్రణాళికలు రూపొందించారు. వెలగపూడిలోని సచివాలయానికి సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు పారిశ్రామిక వేత్తలు, పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఆర్థికంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు.. కిందిస్థాయిలో ఉన్న కుటుంబాలను దత్తత తీసుకునే ఆలోచనతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. 'మార్గదర్శి- బంగారు కుటుంబం' నినాదంతో పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సాయం చేసేవారిని మార్గదర్శిగా, లబ్ధిపొందే వారిని బంగారు కుటుంబంగా వ్యవహరిస్తారు. ఇద్దరికి మధ్య ప్రభుత్వం సంధానకర్తగా ఉంటుంది. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమం లోగోను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి ఆవిష్కరించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

ప్రజాసేవకే నా జీవితం అంకితం

తెలుగువారి తొలి పండుగ ఉగాది రోజున ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం అవుతుంది. అందుకే పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం 'పీ-4' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. సమాజంలో సంపద పెరుగుతున్నా, అది పేదవారికి అందని పరిస్థితి. పేదవారిగా వారు మిగిలిపోవటానికి వీలు లేదు. సంపన్నులు వారికి మార్గదర్శకంగా ఉండి, వారిని కూడా పైకి తీసుకు రావాలి. రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచించే పవన్ కళ్యాణ్, భారత్ దేశాన్ని అగ్రదేశంగా మార్చే మోదీతో కలిసి ప్రభుత్వంలో ఉన్నాం. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉండటం మన అదృష్టం. నా గురించి నేను ఎక్కడా ఎక్కువగా చెప్పుకోను...కానీ ఇవాళ చెపుతున్నాను. 1978లో నేను మొదటిసారి ఎమ్మెల్యే అయ్యాను. మరో 3 ఏళ్లు ఉంటే నేను మొదటిసారి ఎమ్మెల్యే అయ్యి 50 ఏళ్లు అవుతుంది. 5 దశాబ్దాలుగా నన్ను ఆదరిస్తున్న మీకే నా జీవితం అంకితం. 9 సార్లు ఎమ్మెల్యేగా, 4 సార్లు సీఎం అయ్యాను. 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా, 30 ఏళ్లు పార్టీ అధ్యక్షుడిగా ఉన్నాను. దేశంలో ఎవరికీ దక్కని గౌరవం నాకు దక్కింది. అది ఇచ్చింది ఈ రాష్ట్ర ప్రజానీకమే. నా ప్రస్థానాన్ని చూసుకంటే గుండె ఉప్పొంగుతోందని సీఎం చంద్రబాబు భావోద్వేగంతో చెప్పారు.

ఎన్టీఆర్ క్రమశిక్షణలో పెరిగాను

ఎన్టీఆర్ క్రమశిక్షణకు మారుపేరుతో పాటు పట్టుదల గల వ్యక్తి. అనుకున్నది సాధించే వరకు విశ్రమించరు. ఎన్టీఆర్ నీడలో కఠోర క్రమశిక్షణలో పెరిగాను. 47 ఏళ్లుగా ప్రజలే జీవితంగా బతుకుతున్నాను. రాష్ట్రం బాగుండాలని నిత్యం ఆలోచించాను. ప్రజల జీవితాల్లో మార్పు రావాలని కోరుకున్నాను. ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేర్చి నిజాయితీ, అవినీతి రహిత పాలన అందించడమే నాకు తెలిసిన విషయాలు. సుపరిపాలన, మంచి రాజకీయాలనే నమ్మాను. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజల జీవితాల్లో మార్పులు రావాలని అనేక కార్యక్రమాలు తీసుకొచ్చాను. ప్రజల వద్దకే పాలన, జన్మభూమి, ఐటీ విప్లవాన్ని తెచ్చాను. పని తప్ప నాకు మరొకటి తెలియదు...మరో అలవాటు లేదు. నిద్రలేవగానే ప్రజలకు ఏం చేస్తే జీవితాల్లో వారి మార్పు వస్తుందో ఆలోచిస్తాను. రాత్రి పడుకునేటప్పుడు ఈ రోజు ఏం చేశాను, ఎంత మేలు జరిగిందని ఆలోచించి పడుకుంటాను. నేను ఎప్పుడూ తప్పు చేయలేదు, చేయను. నాకు కూడా ఒక కుటుంబం ఉంది. నా కుటుంబానికి రాజకీయాల ద్వారా జీవనోపాధి ఉండకూడదని ఆలోచించి హెరిటేజ్ సంస్థ పెట్టి నా కుటుంబ సభ్యులకు అప్పగించాను. వారు నా మీద ఆధార పడరు...నేనే వారిమీద ఆధార పడతున్నాను. కుటుంబానికి ఆర్థిక స్వావలంబన ఉంటే ధైర్యంగా ఉంటాం...ఆ ధైర్యమే నన్ను ఇప్పుడు నడిపిస్తోంది. నా సతీమణి భువనేశ్వరికి వ్యాపారాలు తెలియవు, వ్యాపారంలోకి నేను వెళ్లనని చెప్పారు. నేను మంత్రిగా, రాజకీయాల్లో ఉన్నాను, నువ్వు వెళ్లకుంటే ఇబ్బందులు వస్తాయని చెబితే హెరిటేజ్ సంస్థ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. అప్పటికి లోకేష్ చిన్న వయసులో ఉండి చదువుకుంటున్నారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు.

మేటైన నగరంగా అమరావతి

టీడీపీ కార్యకర్తలు చాలా మంది ఇబ్బంది పడ్డారు, ప్రాణాలు కోల్పోయారు. నా కోసం జెండా మోసే కార్యకర్తలు చనిపోయారు, వారి పిల్లలు అనాథలు అయ్యారని ఆలోచించి ట్రస్ట్ ఏర్పాటు చేసి చదివించి ప్రయోజకులను చేశాం. దీంతో వారి జీవితాలు బాగుపడ్డాయి. స్కూల్‌కు వెళ్లి వారితో గడిపాను..జీవితంలో ఏం అవుతామని అడిగేవాడిని. మా నాన్నను చంపిన వారిని చంపిన తర్వాత ఏం చేయాలో ఆలోచిస్తామని చెప్పేవారు. చంపిన వారు వారి పాపాన వారు పోతారు, మీరు కూడా అదే పని చేస్తే జైలుకు వెళతారు అని చెప్పి చదివించాను. ఈ రోజు బ్రహ్మాండంగా జీవితంలో సెటిల్ అయ్యారు. 1991లో మన తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలు తెచ్చి దేశ దశ, దిశ మార్చారు. ఎన్టీఆర్ సీఎం అయ్యాక మానవతా దృక్పథంతో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారులు ఒక చిన్న ఆలోచన నుంచి వచ్చాయి. 2 కోట్ల జనాభా ఉన్న మలేషియా చిన్నదేశం. 8 వరుసల రహదారులు ఉన్నాయి. మన దేశం చాలా పెద్దది, మనకు హైవేలు లేవు అని నాటి ప్రధాని వాజ్‌పేయీకి చెప్పాను. ఎలా చేద్దామంటే నాకు వదిలిపెట్టమని చెప్పి తొలుత నెల్లూరు నుంచి చెన్నైకి రోడ్డు వేశాం. నేడు దేశంలో రహదారుల దశ మారింది. విద్యుత్, ఎయిర్ పోర్టు, టెలీ కమ్యునికేషన్‌లో మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ధనికులకే ఫోన్లు ఉండేవి. ఐటీ తీసుకొచ్చాక గ్రామాల్లో వ్యవసాయం చేసే రైతు, రైతు కూలీలు పిల్లలు నేడు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అమరావతి కూడా ప్రపంచంలో మేటైన నగరంగా తయారవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు.

గాడి తప్పిన పాలనను గాడిన పెట్టాం

రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను గాడిన పెట్టాం. నేను, పవన్, కేంద్రం రాష్ట్రంపై శ్రద్ధ పెట్టి పునర్‌నిర్మాణమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. దీని వల్ల ఫలితాలు వస్తున్నాయి. గాడితప్పిన అమరావతిని తిరిగి పట్టాలెక్కించాం. కేంద్రం చొరవతో పోలవరంను 2027కే పూర్తి చేస్తాం. విశాఖకు రైల్వే జోన్ తెచ్చాం. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేయకుండా కేంద్రం ఆర్థిక సాయం అందించింది. ఎన్నికల్లో కూటమిని 93 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిపించారు. మీరు గెలిపించిన సీట్లు రాష్ట్ర అభివృద్ధికి సంజీవనిగా పని చేస్తున్నాయి. 1995లో ఐటీ గురించి మాట్లాడాను...ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ, ఏఐ గురించి మాట్లాడుతున్నా. ఇవి సంసద సృష్టించడానికి ఉపయోగపడతాయి. తెలుగుజాతి బాగుండాలనేది నా కోరిక. తెలుగుదేశం పార్టీ తెలుగుజాతి కోసం పుట్టిన పార్టీ అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

పేదలను ఒకదారికి తీసుకొస్తా

పేదల జీవితాలను ఒకదారికి తీసుకొచ్చే వరకు నా ప్రయత్నాన్ని వదిలిపెట్టను. ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం వచ్చింది. డ్వాక్రా సంఘాలు పెట్టి పొదుపు ఉద్యమం నేర్పించాను. మహిళలు ఇబ్బందులు పడకూడదని ఉచితంగా సిలిండర్లు అందించాను...ఇప్పుడు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఆడపిల్లకు విద్యలో 33 శాతం రిజర్వేషన్లు తెచ్చాం. ఈ రోజు ఆడబిడ్డల ఆదాయమే అధికంగా ఉంటోంది. ఆర్టీసీ బస్సుల్లో కండెక్టర్లుగా అవకాశం కల్పించాం. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు.

నా జీవితానికి ఎన్టీఆరే ఆదర్శం

బిల్ గేట్స్ ఇంటర్నెట్ రెవెల్యూషన్ తీసుకొచ్చారు. ఆయన ఒకస్థాయికి వచ్చాక ప్రజాసేవ ముఖ్యం అని గేట్స్ ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రపంచ కుబేరుడు వారెన్ బఫెట్ కూడా తన సంపాదనలో కొంత డబ్బును సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. విప్రో అధినేత ప్రేమ్ జీ అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా సీఎస్ఆర్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తోంది. స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ చదువుకునేందుకు ఆనాడు అనుకూల పరిస్థితులు లేవు. అంటరాని తనం, అవమానాన్ని ఎదుర్కొన్నారు..కానీ పట్టుదల వదులుకోలేదు. అంబేర్కర్ మేధో శక్తిని గుర్తించి షాయాజీరాజ్ మహరాజ్ అండగా నిలిచి ఆర్థిక సాయం చేశారు. లండన్ వెళ్లి చదువుకోవాలంటే నెలకు 12 డాలర్లు ఇచ్చారు. తిరిగి వచ్చాక అకౌంట్ జనరల్ కార్యాలయంలో ప్రొబేషన్‌గా పెట్టుకున్నారు. తరువాతి కాలంలో న్యాయవాదిగా, ఆర్థిక వేత్తగా, సామాజిక సంస్కర్తగా, భారత రాజ్యాంగాన్ని రాసి భవిష్యత్ తరాలకు ఏం కావాలో నిర్దేశించిన వ్యక్తిగా అంబేద్కర్ ఎదిరగారు. షాయాజీరాజ్ చేసిన సాయం అంబేద్కర్ ఎదుగుదలకు ఉపయోగపడింది. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విశిష్టమైన వ్యక్తి. దేశం గర్వించేలా మిస్సైల్ కనిపెట్టారు. ముస్లింలు, బ్రాహ్మణులు కలిసి భోజనం చేయకూడదని ఆనాడు మూఢనమ్మకాలు

మిగతా 3లో...

పేదలను ఆదుకునే మిషన్ పీ-4

సమాజంలో గేమ్ ఛేంజర్

2వ పేజీ తరువాయి..

ఉన్నాయి. కానీ రామేశ్వరంలో ఉన్న శివసుబ్రహ్మణ్యం అయ్యర్.. అబ్దుల్ కలాంను దగ్గరకు తీసుకుని సూచనలు ఇచ్చి ఆదరించారు. ఈ మాటలను అబ్దుల్ కలాం ఆయన పుస్తకంలో పొందుపరిచారు. వివేకానంద వెనక రామకృష్ణ పరమహంస ఉన్నారు. వివేకా గుణాన్ని అధ్యయనం చేసిన రామకృష్ణ బోధనలు చేసి, ఆధ్యాత్మిక విద్యను నేర్పించారు. తరువాతి కాలంలో ప్రపంచానికే సందేశం ఇచ్చి ప్రపంచం మెచ్చిన నేతగా వివేకానంద ఎదిగారు. నాడు ఎన్టీఆర్ లేకపోతే నేను కూడా సాధారణ వ్యక్తిని అయ్యేవాడిని. ఆయన దగ్గర నేర్చుకున్న పట్టుదల, క్రమశిక్షణ, దగ్గరకు చేర్చిన విధానం నా జీవితంలో మర్చిపోలేను. తన జీవితానికి ఎన్టీఆర్ ఆదర్శం అని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఆదరణ లేక రాణించలేక..

చాలా మందిలో తెలివితేటలు ఉన్నా ఆదరణ లేక రాణించలేకపోయారు. మనతో పుట్టిన మన బంధువులే పేదరికంలో ఉండి చదువుకోలేకపోతున్నారు. అలాంటి వారిని ఆదుకోవాలి. సంపాదించుకున్న ఆస్తులను చనిపోయినప్పుడు తీసుకెళ్లలేరు. మంచిపని చేశామా, స్వార్థంతో బతికామా అన్నదే మనం చనిపోయిన తర్వాత మిగిలిపోతాయి. మీ శక్తిని ఉపయోగించి ప్రజల జీవితాల్లో వెలుగు తెస్తే దాని వల్ల వచ్చే తృప్తి మరొక దాని ద్వారా రాదు. సమాజంలో ఉన్నత స్థానానికి ఎదిగిన వారు.. మరికొందరికి సాయం చేసి పైకి తీసుకురావాలి. సమాజానికి సేవ చేస్తేనే మీ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ప్రతి కుటుంబానికీ విజన్ డాక్యుమెంట్ తయారు చేద్దాం. పీ-4 విధానంలో ప్రభుత్వం మెంటార్‌గా ఉంటుంది. ప్రతి ఇంటికీ సౌకర్యాలు కల్పిస్తాం. అందరికీ ఇల్లు, కరెంట్, నెట్, నీళ్లు, మరుగుదొడ్డి, గ్యాస్ సదుపాయాలు అందిస్తాం. సమాజం ఇచ్చినదాన్ని తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉంది. మన పిల్లల్ని, తెలుగుజాతిని తెలివైన వారిగా మార్చితే వారే డబ్బులు సంపాదిస్తారు. నన్ను 4 సార్లు సీఎం చేసిన ఈ సమాజం బాగుకోసం ఆలోచిస్తున్నా. ఈ కార్యక్రమం ఒక గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ఆగస్టు 15కు ఒక రూపానికి తీసుకొస్తాం

స్వర్ణాంధ్ర విజన్-2047 రూపొందించాం. గతేడాది తలసరి ఆదాయం రూ.2,66,995 ఉంటే ఈ ఏడాది రూ.2,98,065 ఉంది. 2028-29 నాటికి రూ.5,42,985 అవుతుంది. 2047 నాటికి రూ.55 లక్షలకు పెరుగుతుంది. ఇవన్నీ సాధ్యం కావాలంటే ప్రజల్లో కూడా ఆలోచన రావాలి. 2047 నాటికి భారతదేశం అగ్రదేశంగా ఉంటుంది. అందులో మన తెలుగుజాతి అగ్రభాగాన ఉండాలన్నది నా తపన. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు ఇవ్వాలి, సంపద సృష్టించాలి, ఆదాయం పెంచాలి. పెరిగిన ఆదాయాన్ని సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చు చేయాలి. నేను అనుకున్న ఏ ప్రణాళికా ఇప్పటి వరకు ఫెయిల్ అవ్వలేదు. మార్గదర్శులు దత్తత తీసుకున్న వారి కుటుంబాల పరిస్థితి డ్యాష్ బోర్డు ద్వారా సమీక్షిస్తాను. ఆగస్టు 15కు దీన్ని ఒక రూపానికి తీసుకొస్తాం. వచ్చే ఉగాదికి సాధించిన ప్రగతి కూడా మీ ముందు పెడతామని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, పారిశ్రామిక వేత్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

నా జీవితాశయం..

పేదరికం లేని సమాజం

- ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రజల జీవితాల్లో ఉగాది వెలుగులు నింపాలి
- గత ప్రభుత్వంలో అందరికీ అవమానాలే
- ఇక వచ్చే ఐదేళ్లూ అందరికీ రాజపూజ్యం
- తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న సీఎం
- వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి కళారత్న, ఉగాది అవార్డుల ప్రదానం

అమరావతి (చైతన్యరథం): పేదరికం లేని సమాజమే తన జీవితాశయమని అందులో భాగంగానే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ నిర్వహించిన పంచాంగ శ్రవణంలో చంద్రబాబు పాల్గొన్నారు. టీటీడీ పంచాంగం సహా వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ పంచాంగాలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వార్షిక ఉత్సవాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవి. చరిత్రను మర్చిపోతే మనం ఉనికి కోల్పోతాం. ఉగాది అంటే మనకు గుర్తొచ్చేది పచ్చడి, పంచాంగ శ్రవణం. షడ్రుచుల మేళవింపు ఉగాది పచ్చడి. నాకు ఇంకా గుర్తుంది. చిన్న వయసులో రచ్చబండపై గ్రామస్తులంతా కూర్చుని ఉగాది శ్రవణం వినేవాళ్లం. మన సంప్రదాయాలు మరిచిపోకూడదనే ఉద్దేశంతో తెలుగు భాష, కళలకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఆనాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ పక్కన అవధాన కేంద్రం, అన్నమయ్య క్షేత్రం, శిల్ప కళా వేదిక ఏర్పాటు చేశాం. ఢిల్లీ ఏపీ భవన్, చెన్నై పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌లో ప్రభుత్వం తరపున ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

నూతన ఆవిష్కరణలు తప్పనిసరి

ప్రపంచం వేగంగా మారుతోంది. ఈ పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు జరుగుతూనే ఉండాలి. ప్రతి ఒక్కరూ హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలి. కేవలం 25 ఏళ్లలోనే అమెరికన్ల కంటే రెండింతలు ఆదాయం సంపాదించింది మన తెలుగువారే అయినందుకు నాకు గర్వంగా ఉంది. నేనూ, ప్రధాని మోదీ, మిత్రులు పవన్ కల్యాణ్ ఆలోచించేంది ఒకటే. మన రాష్ట్రం, దేశం బాగుండాలని. ప్రపంచంలో మనదేశం అగ్రస్థానంలో ఉంటే, దేశాన్ని నడిపించే శక్తి తెలుగుజాతికి ఇవ్వాలని ఆ భగవంతుణ్ని కోరకుంటున్నానని సీఎం చంద్రబాబు అన్నారు.

వైసీపీ పాలనతో కళ తప్పిన రాష్ట్రం

గత ప్రభుత్వ పాలనలో ఆ ఐదేళ్లూ రాష్ట్రం కళ తప్పింది. అందరం కూర్చుని సంతోషంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. ఈ ఉగాది తెలుగువారి జీవితాల్లో వెలుగులు నింపాలి. గత ప్రభుత్వంలో అందరికీ అవమానాలే. గత ప్రభుత్వం సృష్టించిన సమస్యలు నా సుధీర్ఘ రాజకీయ అనుభవంలో ఏనాడు చూడలేదు. అన్నీ చిక్కుముడులే. ఒక్కో చిక్కుముడిని విడదీస్తూ వ్యవస్థను సరిచేస్తున్నాం. ఇక వచ్చే ఐదేళ్లూ అందరికీ రాజపూజ్యమే. ఈ ఏడాది రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టాం. ప్రజల ఆదాయం పెరగాలి. తద్వారా జీవన ప్రమాణాలు పెరిగి అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాక్షించారు.

టెక్నాలజీని యువత అందిపుచ్చుకోవాలి

ఆనాడు నేను హైటెక్ సిటీ నిర్మించాను. ఐటీని ప్రమోట్ చేశాను. దీంతో వేలాది మంది ఐటీ నిపుణులు పుట్టుకొచ్చారు. వారంతా దేశ, విదేశాల్లో ఆర్థికంగా స్థిరపడ్డారు. వారి తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. నాడు ఐటీ ప్రమోట్ చేశాను. నేడు ఏఐ, క్వాంటమ్ వ్యాలీ గురించి మాట్లాడుతున్నాను. అలాగే ఆనాడు నేను సెల్ ఫోన్లను ప్రమోట్ చేస్తే దాన్ని కూడా కొందరు ఎగతాళి చేశారు. ఈరోజు సెల్ ఫోన్ లేకపోతే మనం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. సెల్ ఫోన్‌ను సక్రమంగా వినియోగించుకుంటే జీవితంలో అనూహ్య మార్పులు వస్తాయి. అయితే వ్యసనంగా మారితే మాత్రం సమస్యలు వస్తాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

పేదరిక లేని రాష్ట్రమే లక్ష్యం-అందుకే పీ4

సంపద కొందరికే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుంది. ఎన్టీఆర్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ సహా ఎవరూ పుట్టుకతోనే గొప్పవారిగా పుట్టలేదు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని మహోన్నత వ్యక్తులుగా ఎదిగారు. నేడు ఉగాది పర్వదినాన మార్గదర్శి- బంగారు కుటుంబం.. జీరో పావర్టీ-పీ4కు శ్రీకారం చుట్టాను. సంపన్నులు పేదలను ఆదుకోవాలి. వారిని ఆర్థికంగా పైకి తేవాలి. అందరికీ విద్య, వైద్యం అందాలి. సమాజంలో ఉన్నత స్థానంలోని 10 శాతం మంది...సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేద కుటుంబాలను ఆదుకుని వారి ఆర్థిక అభ్యున్నతికి స్వచ్ఛందంగా ముందుకువచ్చి సహకరించాలి. దాతృత్వంలో మన తెలుగువాళ్లు ప్రపంచానికే ఆదర్శం కావాలని సీఎం చంద్రబాబు పిలుపు ఇచ్చారు.

పీపుల్ ఫస్ట్ మా నినాదం

ఈ 9 నెలల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పీపుల్స్ ఫస్ట్ నినాదంతోనే పాలన సాగిస్తున్నాం. ఓవైపు సంక్షేమం, అభివృద్ధి అందిస్తూనే మరోవైపు రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నాం. గతంలో నేను ప్రజల వద్దకు పాలన ప్రవేశపెట్టాను. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఉగాది పురస్కారాలు

నాగఫణి శర్మను 30 ఏళ్లుగా చూస్తున్నానని... అయితే ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని ముఖ్యమంత్రి అన్నారు. వారి సేవలను గుర్తించి పద్మశ్రీ ఇవ్వడం మన తెలుగువారు అందరికీ గర్వకారణమని చెప్పారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరిగింది. 86 మందికి కళారత్న అవార్డులు, 116 మంది ఉగాది అవార్డులు అందుకున్నారు.

వచ్చేవన్నీ మంచిరోజులే

సీఎం చంద్రబాబు ఉగాది శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు చెప్పారు. వచ్చేవన్నీ మంచి రోజులనే సానుకూల దృక్పథంతో కొత్త ఏడాదిని స్వాగతిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ రాబోయే కాలంలో గణనీయమైన ప్రగతి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చంద్రబాబు తెలిపారు విశ్వావసు నామ సంవత్సరం తెలుగు ప్రజలందిరిలో సంతోషాన్ని నింపాలని, సకల విజయాలనూ అందించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

ఉగాది ప్రజల జీవితాల్లో సంతోషం నింపాలి

- మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారిలో కొత్త ఆనందాలు తెచ్చే పండుగల్లో ఉగాది ప్రత్యేకమైంది. ఉగాది పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలి. ఈ తెలుగు సంవత్సరాది మీ ఆశలు, ఆశయాలు నెరవేర్చి.. ఏడాది పొడవునా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.

అలా.. తెలుగుఖ్యాతి విశ్వవ్యాప్తమైంది

43ఏళ్ల టీడీపీ ఉజ్వల చరిత్ర -గుణపాఠాలు 1

-గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

1982నాటికి స్వాతంత్ర్యం వచ్చి 35 ఏళ్లు నిండాయి. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో అక్టోబర్ 1, 1953న ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగింది. 1983 జనవరి 9వరకు ఏకచ్ఛత్రాధిపత్యంగా కాంగ్రెస్ పాలన సాగింది. 30ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ఉండేవి కాదు. అవినీతి రాజ్యమేలేది. తెలుగువారిని మదరాసీలుగా పిలిచే స్థితి ఉండేది. ఎన్టీఆర్.. చంద్రబాబు పాలనలో తెలుగువారి ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది.

1982 నాటికి తెలుగువారి స్థితి -తెలుగుదేశం ఆవిర్భావానికి ముందు..

- *కరెంటు లేని గ్రామాలు, ఉన్నచోట కరెంటు కోతలు, వ్యవసాయ మోటార్లకు అధిక విద్యుత్ ఛార్జీలు.*
- *సాగునీటి ప్రాజెక్టులు తగినన్ని లేవు. త్రాగునీటి కష్టాలు ఎన్నో.*
- *విద్యా సంస్థలు, వైద్యశాలలు పరిమితంగా వుండేవి. పై చదువులకు పొరుగు రాష్ట్రాలకు వెళ్లే స్థితి.*
- *రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా వుండేది. రోడ్లులేని గ్రామాలూ ఎక్కువే.*
- *పరిశ్రమలు నామమాత్రంగా వుండేవి.*
- *పేదలకు పక్కా ఇళ్ల పథకం లేదు. వితంతు, వృద్ధాప్య పింఛన్లు లేవు.*
- *రేషన్ బియ్యం రేట్లు ఎక్కువగా వుండేవి.*
- *మహిళా రిజర్వేషన్లు లేవు. మహిళలకు ఆస్తి హక్కు లేదు.*
- *బీసీ రిజర్వేషన్లు లేవు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానాలు లేవు.*
- *మునసబు, కరణం, పటేల్-పట్వారీ వ్యవస్థల ద్వారా ప్రజల్ని పీడించేవారు.*
- *రాజకీయ స్వార్థం కోసం మత మారణహోమం సృష్టించేవారు.*
- *తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు లేదు. మదరాసీలుగా పరిగణించేవారు.*
- *ఏపీ ముఖ్యమంత్రుల్ని ఢిల్లీ పాలకులు సీల్డ్‌కవర్ ద్వారా నియమించేవారు. తెలుగువారి ఆత్మాభిమానాన్ని మంటగలిపేవారు.*

తెలుగుదేశం ఆవిర్భావం తరువాత..

తెలుగువారి దుస్థితికి చలించిన అన్న ఎన్టీఆర్.. సినీరంగంలో పొందుతున్న కోట్ల రూపాయల సంపాదనను త్యాగం చేసి రాజకీయ రంగంలో ప్రవేశించారు.

- *1982 మార్చి 29న హైదరాబాద్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలుగుదేశం పార్టీ ఏర్పాటు ప్రకటన ఎన్టీఆర్ జారీ చేశారు.*

- *కళ్యాణప్రదమైన పసుపు పచ్చని వస్త్రంపై ఎర్రని చక్రం, ఆకుపచ్చని నాగలి, తెల్లని కుటీరంతో పార్టీ జెండాను ఆవిష్కరించారు.*
- *సామాన్యుల వాహనం సైకిల్‌ను ఎన్నికల గుర్తుగా నిర్ణయించారు.*
- *1982 జూన్ 14న చైతన్యరథంపై 35వేల కి.మీ. రాష్ట్రమంతా ప్రచారయాత్ర నిర్వహించి ప్రజల్ని చైతన్యపరిచారు. 1983 జనవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకుగాను 202 సీట్లలో విజయం సాధించారు. టీడీపీకి 46.30 శాతం ఓట్లురాగా, కాంగ్రెస్ 33.42శాతంతో 60 సీట్లుకు పరిమితమైంది.*
- *పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి పీఠం ఎక్కి రికార్డు సృష్టించారు ఎన్టీఆర్. 1983 జనవరి 5న వెలువడిన అసెంబ్లీ ఫలితాలలో టీడీపీ భారీ విజయం సాధించింది.*
- *రాజ్‌భవన్‌లో సీఎంగా ప్రమాణం చేసే సాంప్రదాయానికి భిన్నంగా తనను ఎన్నుకొన్న లక్షలాది ప్రజల సమక్షంలో ఎల్బీ స్టేడియంలో 1983 జనవరి 9న ఎన్టీఆర్ 10వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్సేతర మొదటి సీఎంగా ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారు.*
- *అప్పటివరకు సంపన్నులకు, పెత్తందార్లకు పరిమితమైన ఎమ్మెల్యే స్థానాలలో 289 సీట్లలో 128మంది గ్రాడ్యుయేట్లు, 28 స్థానాలలో పోస్టు గ్రాడ్యుయేట్లు, 20స్థానాలలో డాక్టర్లు, 8 స్థానాలలో ఇంజనీర్లు, 47 స్థానాలలో లాయర్లను నిలబెట్టిన ఘనత ఎన్టీఆర్‌ది.*
- *రూ.2లకే కిలో బియ్యం పథకంపెట్టి అప్పటివరకు వరి అన్నం తినని పేదలకు అన్నం పెట్టిన పేదల దైవం అన్న ఎన్టీఆర్.*
- *చేనేతల దగ్గర బట్టలు కొని ఆప్కో ద్వారా పేదలకు తక్కువ ధరకు జనతా వస్త్రాలు అందించారు.*
- *పేదవారి కోసం దేశంలోనే ప్రథమంగా పక్కా ఇళ్లు కట్టించి ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో ఇల్లంటే గుడిసెలు వేసుకోవడానికి తాటాకులు, ఎదురు బొంగులు మాత్రమే ఇచ్చేవారు.*
- *నెలకు రూ.30లతో వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లను తొలిగా ప్రారంభించారు ఎన్టీఆర్.*
- *బడికి వెళ్లే ఏ బిడ్డా ఆకలితో ఉండకూడదని మధ్యాహ్న భోజన పథకం పెట్టారు. 220 గురుకుల పాఠశాలలు ప్రారంభించారు.*
- *స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20శాతం, మహిళలకు 9శాతం రిజర్వేషన్ కల్పించారు. విద్య, ఉద్యోగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించారు.*
- *ఎస్సీలకు రిజర్వేషన్ 14 శాతంనుండి 15 శాతానికి... ఎస్టీలకు 4 శాతంనుంచి 6 శాతానికి పెంచారు.*
- *జిల్లా పరిషత్‌లు, పంచాయతీలకు విధులు, నిధులు బదలాయించారు, బలోపేతం చేశారు. 1985లో మైనారిటీ కార్పొరేషన్ స్థాపన చేశారు.*
- *1986లో "హిందూ వారసత్వ చట్టం"లో మార్పుచేసి మహిళలకు ఆస్తి హక్కు కల్పించారు.*
- *తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్థాపించారు. తెలుగు యూనివర్సిటీ, మెడికల్ యూనివర్సిటీ, ఓపెన్ యూనివర్సిటీ నెలకొల్పారు.*
- *రైతుల మోటార్లకు విద్యుత్ ఛార్జీల భారం తగ్గించడానికి రూ.50లకే 5 హార్స్ పవర్ విద్యుత్ ఇచ్చారు. 4,610 సహకార పరపతి సంఘాల ద్వారా పంట రుణాలు మంజూరు.*
- *నేషనల్ ఫ్రంట్ కన్వీనర్‌గా దేశవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల రుణమాఫీ చేయించారు*
- *తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, ఎస్ఆర్‌బీసీ, ఎస్‌యల్‌బీసీ, శ్రీరాంసాగర్, జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, పులిచింతల, గుండ్లకమ్మ, వంశధార రెండోదశ, మద్దివలసలాంటి సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించారు.*
- *గ్రామీణ క్రాంతి పథకం ద్వారా బోర్లు, బావులు, చెరువులు అభివృద్ధి చేశారు.*
- *భూమి శిస్తు రద్దు చేశారు. ట్రాక్టర్లపై పన్ను రద్దు చేశారు.*
- *నిమ్స్‌ను ఆధునీకరించారు. తిరుపతిలో స్విమ్స్ స్థాపించారు.*
- *రాయలసీమలో ముద్దనూరు థర్మల్ పవర్ ప్లాంట్, విజయవాడ థర్మల్ ప్లాంట్ రెండవ దశ, కొత్తగూడెం థర్మల్ ప్లాంట్ నిర్మించారు.*
- *339 తాలూకాలను 1104 మండలాలుగా చేసి పాలనా వికేంద్రీకరణ కోసం మాండలిక వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల వద్దకు పాలన చేర్చారు.*
- *సహకార వ్యవస్థలో సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టారు.*
- *ప్రతి మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.*
- *వైద్యరంగ అభివృద్ధి కోసం 1987 మార్చి 1న 'వైద్య విధాన పరిషత్' ఏర్పాటు చేశారు.*
- *అప్పటివరకు సంపన్నులకే పరిమితమైన మెడికల్, ఇంజనీరింగ్ విద్యను సామాన్యులకు అందుబాటులోకి తేవడానికి ఎంసెట్ విధానం ప్రవేశపెట్టారు.*
- *కరణాలు, మునసబులు... పటేల్-పట్వారీ వ్యవస్థలను రద్దు చేసి ప్రజలకు స్వేచ్ఛ కల్పించారు.*
- *1985 డిసెంబర్ 2న తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించారు.*
- *1985 ఏప్రిల్ 6న తిరుమలలో నిత్య అన్నదాన పథకం ప్రారంభింపచేశారు.*
- *భారీ బస్ స్టేషన్లు, బస్ షెల్టర్ల నిర్మాణాలు చేయించారు.*
- *మతకల్లోలాలు అరికట్టి హైదరాబాద్‌ను కర్ఫ్యూ రహిత నగరంగా మార్చారు.*
- *హుస్సేన్‌సాగర్ మధ్యలో బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన. ట్యాంక్‌బండ్‌పై తెలుగుతేజాల విగ్రహాల ప్రతిష్ఠాపన జరిపారు.*
- *ప్రధాని అయిన తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు నంద్యాలలో ఎంపీగా పోటీ చేసినప్పుడు.. వారికి ఎన్టీఆర్ పోటీ పెట్టలేదు.*
- *మదరాసీలుగా పిలవబడే తెలుగుజాతికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. తెలుగు భాషాభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారు.*
- *1989లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి, వీపీ సింగ్ ప్రధాని కావడానికి ఎన్టీఆర్ కారకులు.*
- *ఎన్టీఆర్ ఉపదేశించిన తారకమంత్రం ఒకటే "ప్రజలే దేవుళ్ళు... సమాజమే దేవాలయం".*

తెలుగుదేశంలోకి చంద్రబాబును ఆహ్వానించిన ఎన్టీఆర్

- *ప్రభుత్వానికి ప్రజాభిమానం మెండుగావున్నా పార్టీ సంస్థాగత నిర్మాణం నామమాత్రంగా ఉండటంతో.. ఆ లోటును అధిగమించే సామర్థ్యం వున్న నేత అవసరం పార్టీకి ఏర్పడింది.*
- *అలాగే కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలకు దీటైన వ్యూహరచన చేసే నేత అవసరం ఏర్పడింది.*
- *ఫ్యాక్షనిస్టులతో పోరాడి గెలిచిన అనుభవాలు, పార్టీ నిర్మాణ దక్షత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రమశిక్షణ, కఠోర శ్రమ చేసే లక్షణాలున్న చంద్రబాబును తెలుగుదేశంలో చేరమని ఎన్టీఆర్ ఆహ్వానించారు.*
- *ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు చంద్రబాబు 1984 ఫిబ్రవరిలో టీడీపీలో అధికార పూర్వకంగా చేరారు.*
- *ప్రభుత్వ పదవులకు ఆరాటపడకుండా చంద్రబాబు పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ క్యాడర్ శిక్షణా తరగతులు, పార్టీ సభ్యత్వం కంప్యూటరీకరణను జయప్రదంగా నిర్వహించారు.*

తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, ఎస్ఆర్‌బీసీ, ఎస్‌యల్‌బీసీ, శ్రీరాంసాగర్, జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, పులిచింతల, గుండ్లకమ్మ, వంశధార రెండోదశ, మద్దివలసలాంటి సాగునీటి ప్రాజెక్టులు తెలుగుదేశం ఘనతే.

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ఉగాది పచ్చడిని స్వీకరించారు. పండితులు మాడుగుల నాగఫణిశర్మ పంచాగ శ్రవణం చేశారు. ఈ వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, అధికారులు పాల్గొన్నారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరిగింది. 86 మందికి కళారత్న అవార్డులు, 116 మంది ఉగాది అవార్డులు అందుకున్నారు.



పండుగలు మన దేశ సంస్కృతిలో భాగం

- స్వర్ణభారత్ ట్రస్ట్ ఉగాది సంబరాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

- సమాజ బాగు కోసం తపనపడే వ్యక్తి వెంకయ్యనాయుడు
- ట్రస్ట్ నడపడం అంటే సాధారణ విషయం కాదు
- స్వర్ణ భారత్ ట్రస్ట్ యువతలో స్ఫూర్తిని నింపుతోంది
- విలువలు లేనివారితో పోరాడుతున్నందుకు ఆవేదనగా ఉంది

అమరావతి (చైతన్యరథం): పండుగలు మనదేశ సంస్కృతి, వారసత్వంలో భాగమని, ఏ దేశంలో లేని కళలు, సంప్రదాయాలు మన దేశంలోనే ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇతర దేశాల వారు కూడా మన సంప్రదాయాలు, సంస్కృతులను పాటిస్తున్నారంటే అది మన దేశ గొప్పతనమన్నారు. కృష్ణా జిల్లా ఆత్కూర్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉగాది సంబరాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, మహిళలతో సీఎం కాసేపు ముచ్చటించారు. అనంతరం ప్రసంగించారు.

సమాజం కోసం తపనపడే వ్యక్తి వెంకయ్య నాయుడు

తెలుగువారి తొలి పండుగ ఉగాది. ఈ ఉగాది నుంచే మన తెలుగు వారి పండుగలు ప్రారంభమవుతాయి. కలిసికట్టుగా సమస్యలను ఎదుర్కొనే కుటుంబ వ్యవస్థ మన దేశానికి ఉంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాష్ట్రం, దేశం, సమాజం గురించి తపనపడే వ్యక్తి. నేను, వెంకయ్య నాయుడు ఒకేసారి ఎమ్మెల్యేలు అయ్యాం. అసెంబ్లీలో వెంకయ్య నాయుడు మైకు తీసుకుంటే అందరూ గజగజలాడేవారు. అంచలంచెలుగా ఎదిగారు. ఇద్దరం ఒకే పార్టీలో లేకపోయినా ప్రజాహితం కోసం ఆలోచించాం. ఎన్టీఆర్‌ను సీఎంగా తొలగించినప్పుడు నేను అండగా నిలబడతానని వచ్చి 30 రోజులపాటు పోరాడి మళ్లీ ఎన్టీఆర్ సీఎం అయ్యాక ఇంటికి వెళ్లారు. సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షునిగా, కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతిగా పని చేశారు. వెంకయ్యనాయుడు తన పిల్లలకు జీవనోపాధికి మాత్రమే సాయం చేశారు. ప్రజల కోసం ఆయన సృష్టించిన ఆస్తులను చూసి అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు.

విలువలు లేని వారితో పోరాడుతుంటే ఆవేదన కలుగుతోంది

రానురాను విలువలు పడిపోతున్నాయని వెంకయ్య నాయుడు అన్నారు. నాకు కూడా అదే అనిపిస్తోంది. ఎన్టీఆర్, జ్యోతిబసు, వాజపేయ్.. సమాజంలో విలువలు గల వ్యక్తులతో నేను పని చేశా. కానీ నేడు రాష్ట్రంలో ఎవరితో పోటీ పడుతున్నానో చూసుకుంటే నిరాశ కలుగుతోంది. కానీ ప్రజల కోసం నిరంతరంగా పని చేయాలి. నేను చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పని చేస్తా. ఒక ట్రస్ట్ నడపడం అంత తేలికైన వ్యవహారం కాదు. కానీ స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను మహిళ అయిన దీపా వెంకట్ నడుపుతున్నారంటే అభినందించాలి. విద్యార్థులతో సమావేశమయ్యాను. ఎంట్రప్రెన్యూర్‌లు అవుతామని, ఉద్యోగాలు ఇస్తామని గ్రామాల్లోని యువత ఆలోచిస్తున్నారంటే ఇది స్వర్ణ భారత్ ట్రస్ట్ నింపిన స్ఫూర్తి. సంస్కృతి,

సాంప్రదాయాలను భావి తరాలకు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేను సీఎంగా ఉన్నప్పుడు ట్రస్ట్‌కు భూమి ఇవ్వండని కూడా వెంకయ్య నాయుడు అడగలేదు. ప్రభుత్వం నుంచి ఏమీ ఆశించకుండా అడగకుండా ట్రస్ట్ నడుపుతున్నారు. ఇక్కడ వివిధ విభాగాల్లో శిక్షణ తీసుకునేవారికి 90 శాతం ప్లేస్మెంట్ వస్తోంది. ప్రకృతి వ్యవసాయం, పాడి వంటి రంగాల్లో ఉత్తమ శిక్షణ ఇస్తున్నారు. 1991లో మన తెలుగువారైన పీవీ నరసింహారావు సంస్కరణలు తీసుకొచ్చి దేశ దశదిశ మార్చారు. ఎన్టీఆర్ సీఎం అయ్యాక ప్రభుత్వం అంటే పరిపాలనే కాదు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టారు. నేను ఐటీని దూరదృష్టితో ప్రమోట్ చేశాను. దీంతో మనవాళ్లు ఈ రోజు ఇతర దేశాల వారితో పోలిస్తే రెండింతల ఆదాయం సంపాదిస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు.

స్వర్ణభారత్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు, మహిళలతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. వర్క్ ఫ్రమ్ హోం గురించి ఎంతవరకు అవగాహన ఉందని ప్రశ్నించారు. మీ గ్రామాల్లో ఎవరైనా వర్క్ ఫ్రమ్ హోం కింద పని చేస్తున్నారా అని ఆరా తీశారు. ఇంటిపనులు చేస్తూనే ఉపాధి అవకాశాలపైనా దృష్టి పెట్టాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకే వర్క్ ఫ్రమ్ హోంకు శ్రీకారం చుట్టామన్నారు. దీనిపై అందరికీ అవగాహన కల్పించేలా చెప్పాలని అక్కడివారికి సూచించారు. స్వర్ణభారత్ తరపున కూడా మహిళల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

ట్రస్ట్ సేవలు నిరాటంకంగా కొనసాగాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

అమరావతి (చైతన్యరథం): స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా అనేక ఆస్పత్రుల సహకారంతో రోగులకు సేవలు అందిస్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా ఆత్కూరులో నిర్వహించిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబుతోపాటు, వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ... చిన్నస్థాయి నాయకుడి నుంచి ఎదిగి ఉపరాష్ట్రపతి పదవి వరకు వెళ్లినా.. స్వర్ణభారతి ట్రస్టు సేవలే అన్నిటికంటే ఎక్కువ తృప్తి ఇస్తున్నాయని అన్నారు. తన తర్వాత కూడా ట్రస్టు సేవలు నిరాటంకంగా కొనసాగాలని ఆకాంక్షించారు. మనం పైకి వచ్చాక తోటివారినీ పైకి తీసుకురావాలి, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న తృప్తి మరో పనిలో రాదు. సమాజంలో అనేక మార్పులకు యువత కారకులు కావాలి. ఒకప్పుడు మనదేశం ప్రపంచస్థాయి విద్యాకేంద్రంగా ఉండేది. ప్రపంచ నలుమూలల నుంచి నలంద, తక్షశిల, విక్రమశిల వర్సిటీకి వచ్చేవారని వెంకయ్యనాయుడు అన్నారు.

ఐసీసీ ఛైర్మన్ జైషాతో కలిసి

విశాఖలో ఐపీఎల్ మ్యాచ్ వీక్షించిన మంత్రి లోకేష్

- ఘన స్వాగతం పలికిన ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్ని, సభ్యులు
- స్టేడియం పునరుద్ధరణ పనుల శిలాఫలకం ఆవిష్కరణ

విశాఖపట్నం (చైతన్యరథం): ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖలో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌కు హాజరయ్యారు. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన సన్ రైజర్స్ హైదరాబాద్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మ్యాచ్‌ను ఐసీసీ ఛైర్మన్ జైషాతో కలిసి మంత్రి లోకేష్ వీక్షించారు. అంతకుముందు విశాఖ క్రికెట్ స్టేడియానికి చేరుకున్న మంత్రి లోకేష్, ఐసీసీ ఛైర్మన్ జై షా, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీలకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, ఇతర సభ్యులు ఘనస్వాగతం పలికారు. మంత్రి లోకేష్‌ను ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని శాలువాతో సత్కరించి మొమెంటో బహూకరించారు.

అనంతరం స్టేడియం పునరుద్ధరణ, ఆధునికీకరణను పురస్కరించుకుని ఐసీసీ ఛైర్మన్ జై షా, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని చిన్నితో కలిసి నారా లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీ భరత్, మాజీ క్రికెటర్ చాముండేశ్వరినాథ్, బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్, ట్రెజరర్ దండమూడి శ్రీనివాస్, ఇతర ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు కూడా పాల్గొన్నారు. అంతకు ముందు విశాఖ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, ఐసీసీ ఛైర్మన్ జై షాకు టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు.

ఏఐ స్టార్టప్ నెలకొల్పి స్ఫూర్తిగా నిలిచావు

- దివ్యాంగ విద్యార్థి రఘునాథరెడ్డిని అభినందించిన మంత్రి లోకేష్
- మంత్రి చొరవతో గతంలో ఎన్ఐటీ కాలికట్‌లో సీటు పొందిన విద్యార్థి
- ఇంటర్ ధృవపత్రంలో తప్పును సరిదిద్ది గతంలో 25 మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్ కాపాడిన మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో గతంలో ఎన్ఐటీ కాలికట్‌లో సీటు పొందిన దివ్యాంగ విద్యార్థి సి.రఘునాథరెడ్డి ఏఐ స్టార్టప్ ను నెలకొల్పి పలువురికి స్ఫూర్తిగా నిలిచాడు. గతేడాది జులైలో దేశవ్యాప్తంగా వివిధ ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు పొందిన దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు సర్టిఫికెట్ అప్ లోడ్ చేసే విషయంలో సమస్య ఎదురైంది. సదరు సమస్యను వాట్సాప్ ద్వారా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకురావడంతో ఆయన మెరుపు వేగంతో స్పందించారు. దివ్యాంగ విద్యార్థుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక జీవో విడుదల చేసి 25 మంది విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడారు. దీంతో వారంతా పేరెన్నికగన్న ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందారు. తమకు అండగా నిలిచిన మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి చొరవతో విజయవాడకు చెందిన సి.రఘునాథరెడ్డి ఎన్ఐటీ కాలికట్‌లో సీటు పొందాడు. తన ప్రతిభతో ఇటీవల విద్యార్థులో నైపుణ్యం, నెట్ వర్కింగ్ సామర్థ్యాల పెంపునకు ఎన్ఐటీ స్టార్టప్ ఇంక్యుబేటర్ ప్రోత్సాహంతో ఏఐ స్టార్టప్‌ను నెలకొల్పాడు. గతంలో మంత్రి లోకేష్ ఇచ్చిన సహకారం, మార్గదర్శకం వల్లే రాణించగలగుతున్నానని రఘునాథరెడ్డి ఎక్స్ ద్వారా కృతజ్ఞతలు తెలిపాడు. రఘునాథరెడ్డి ట్వీట్ పై స్పందించిన మంత్రి నారా లోకేష్.. మీ ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకమన్నారు. మీ విజయంలో నేను చిన్న పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఏఐ స్టార్టప్‌ను నెలకొల్పిన రఘునాథరెడ్డిని, బృందాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పెండింగ్ బిల్లులకు మోక్షం

- రూ.2 వేల కోట్ల మేర చెల్లింపులు

- చిన్న కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత
- 17 వేల మందికి చెల్లింపులు
- ఆర్థికమంత్రి పయ్యావుల వెల్లడి

అమరావతి (చైతన్యరథం): దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ బిల్లులకు మోక్షం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ భేటీ అయ్యారు. బిల్లుల చెల్లింపులపై కసరత్తు చేశారు. సుమారు 17 వేల మందికి రూ.2 వేల కోట్ల మేర చెల్లింపులు చేయనున్నారు. నీరు-చెట్టు, గుంతల రహిత రోడ్లు, నాబార్డు పనులకు బిల్లుల చెల్లింపులు చేయనున్నట్లు మంత్రి పయ్యావుల వెల్లడించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ బిల్లులతో పాటు పోలవరం ప్రాజెక్టుకూ కొంత మొత్తం విడుదల చేయనున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించాలన్న సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో పని చేస్తున్నామని చెప్పారు.

ఎన్ని ఇబ్బందులున్నా పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు బిల్లుల చెల్లింపులు దోహదం చేస్తాయన్నారు. గత మూడు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా చెల్లిస్తున్నట్లు చెప్పారు.

9 వేల మంది చిన్న కాంట్రాక్టర్లు, 8 వేల మంది నీరు-చెట్టు లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు చేస్తున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. దీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న వివిధ బిల్లుల చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. సాధ్యమైనంత మేరకు ఫిఫో (ముందు వచ్చిన వారికి ముందు) పద్ధతిని పాటిస్తూ చెల్లింపులు జరపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

మొత్తం విడుదల చేస్తున్న బిల్లుల్లో రూ. 2000 కోట్లలో 90 శాతం చిన్న కాంట్రాక్టర్లకు.. కేవలం 10 శాతం మాత్రమే పెద్ద కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరపనున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రూ. కోటి లోపు ఉన్న బిల్లులే ప్రాధాన్యంగా చెల్లింపుల ప్రక్రియ జరుగుతోందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం విశ్వావసు నామ ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి, టీడీపీ తెలంగాణ దళిత విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి గూడెపు రాఘవులు, తెలుగుదేశం కార్యకర్తలు

విశాఖలో నిర్మాణాత్మకంగా క్రీడల అభివృద్ధి

- ఎమ్మెల్యే గణబాబు సూచనలతో ప్రత్యేక ప్రణాళికలు
- విశాఖలో 11 క్రీడల నిర్వహణకు చర్యలు
- త్వరలో వాటర్ గేమ్స్ పునఃప్రారంభిస్తాం
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలో నిర్మాణాత్మకంగా క్రీడలను అభివృద్ధి చేసేందుకు స్థానిక వెస్ట్ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు(గణబాబు) సూచనలతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. నగర పరిధిలోని గోపాలపట్నం మినీ ఇండోర్ హాలును వెస్ట్ ఎమ్మెల్యే గణబాబుతో కలిసి ఆదివారం రవినాయుడు సందర్శించారు. తొలుత ఇండోర్ హాలులోని బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్ టెన్నిస్, జిమ్, క్రికెట్ గ్రౌండును ఆయన పరిశీలించారు. ఇండోర్ హాలు నిర్వహణ, క్రీడల అభివృద్ధిపై డీఎస్ఏ అధికారులను ఆరా తీశారు. అలాగే ఇండోర్ హాలులో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే గణబాబు సూచనలు, సహకారంతో విశాఖలో పదకొండు క్రీడలను నిర్వహించేలా ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విశాఖను క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. దానిలో భాగంగానే విశాఖలో స్పోర్ట్స్ అకాడమీ స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే అకాడమీని ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు.

ఏపీ నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వారిలో విశాఖ క్రీడాకారులు అధికంగా ఉన్నారన్నారు. దానికి అనుగుణంగా విశాఖలో మెరుగైన క్రీడావసతులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే గ్రామీణ క్రీడలను సైతం ప్రోత్సాహించేందుకు, విద్యార్థులు క్రీడలవైపు మొగ్గు చూపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నాడు శాప్ డైరెక్టర్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గణబాబు విశాఖకు వాటర్స్ గేమ్స్‌ను తీసుకొచ్చారన్నారు. కానీ గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి స్వార్థానికి వాటర్ గేమ్స్ నిర్వీర్యమయ్యాయన్నారు. త్వరలోనే వాటర్ గేమ్స్‌ను పునఃప్రారంభిస్తామని, పదిహేను రోజుల్లో ఆక్రమణకు గురైన వాటర్ స్పోర్ట్స్ స్థలాన్ని శాప్ ఆధీనంలోకి తీసుకుంటామన్నారు. అలాగే అసోసియేషన్లు, ఫెడరేషన్లు, డీఎస్ఏల అధికారులు సమన్వయంతో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే ఇండోర్ హాలును స్వీయసుస్థిరత మార్గంలో నిర్వహించనున్నామన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే గణబాబు

క్రీడల్లో రాణింపు, క్రీడల అభివృద్ధి విషయంలో ప్రపంచ దేశాలన్నీ పోటీపడుతున్నాయని విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు వివరించారు. క్రీడలతో తమ కీర్తిప్రతిష్టతలను అన్ని దేశాలు చాటుకుంటున్నాయన్నారు. క్రీడాపరంగా ముందంజలో ఉన్న దేశాల సరసన భారత్ కూడా నిలవాలంటే అత్యధిక పతకాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మొదటి నుంచి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని, దానిలో భాగంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ క్రీడాసౌకర్యాలను కల్పించారని, అప్పట్లోనే జాతీయ, ఆసియా, ఎఫ్రాన్ క్రీడలను సైతం విజయవంతంగా నిర్వహించారన్నారు. ప్రస్తుతం ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు దృఢనిశ్చయంతో పనిచేస్తున్నారన్నారు. దానికోసమే శాప్ ఛైర్మన్ పదవిని సమర్థుడైన రవినాయుడుకు అప్పగించారన్నారు. అనతికాలంలోనే రాష్ట్ర క్రీడల అభివృద్ధిలో విప్లవాత్మకమార్పులు తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు కూడా క్రీడలను ప్రోత్సహించాలని, తద్వారా తమ బ్రాండ్ కూడా మరింత విస్తరించుకునే అవకాశం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ జూన్ గాలియట్, శాప్ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి, అమ్మవార్ల ప్రసాదాన్ని అర్చకులు సీఎం చంద్రబాబుకు అందించి ఆశీర్వదించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో

ఘనంగా ఉగాది వేడుకలు

- పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, నేతలు

అమరావతి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సిద్ధాంతి మాచిరాజు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది వేడుకల్లో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ.. తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం ఉగాది నుండి కష్టాలు, కన్నీళ్లు, సమస్యలు దూరమై రాష్ట్ర ప్రజలు సుఖంగా ఉండాలని.. ఆరోగ్యవంతమైన జీవితాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ముందుకు సాగాలని.. అలాగే ప్రజా సంక్షేమానికి ప్రజలకోసం అహర్నిశలు పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్‌లకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలను అందించి వారు నిత్యం ప్రజా సేవకు పాటుపడేలా ఆ దైవం ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు. భారతీయ సాంప్రదాయం ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణాల ద్వారా తెలుస్తోంది. తెలుగు ప్రజలకు ముఖ్య పండుగల్లో ఉగాది మొదటి పండుగ. ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి కొత్తగా పనులకు శ్రీకారం చుడతారు. షడ్రుచుల సమ్మేళనం(తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు) అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి మహా ప్రసాదం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాంజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు రమణ, బ్రాహ్మణ సాధికారసమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, ధామోదర్, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో పేదరిక నిర్మూలన లక్ష్యం

జీరో పావర్టీ - పీ 4 కార్యక్రమం ప్రారంభం

- సంపన్నులు-పేదల మధ్య వారధి

- సమాజానికి తిరిగి ఇచ్చే సమయం

- రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలకు కొత్త ఆశ

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పర్వదినం రోజున.. జీరో పావర్టీ–పీ 4.. కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే దార్శనికతతో స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఇది పదిసూత్రాలు లేదా 10 మార్గదర్శక సూత్రాల ద్వారా సాధ్యపడుతుంది. వాటిలో ముఖ్యమైనది రాబోయే 5 సంవత్సరాలలో జీరో పావర్టీని సాధించడం.

బలహీన వర్గాల జనాభాకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం బలమైన సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. అయితే, జీరో పావర్టీని సాధించడానికి సమాజం నుండి అంకితభావంతో కూడిన కృషి కూడా అవసరం.

గత కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో తలసరి జీడీపీలో స్థిరమైన పెరుగుదల ప్రైవేట్ సంపదను సృష్టించింది, కొన్ని కుటుంబాలు అవకాశాలను అందిపుచ్చుకుని విజయాన్ని సాధించడానికి వీలు కల్పించింది. విజయం సాధించిన వారు సామాజిక మద్దతుగా సమాజానికి తిరిగి ఇవ్వడానికి బలమైన సంకల్పం కలిగి ఉన్నప్పటికీ వెనుకబడిన వర్గాల వారికి తోడ్పాటు ఇవ్వడానికి నిర్మాణాత్మక మార్గాలు లేవు. ఈ దాన స్ఫూర్తిని ఉపయోగించుకోవడానికి, ప్రభుత్వం జీరో పావర్టీ–పీ 4 (ప్రజా ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యం)ను ప్రవేశపెడుతోంది, ఇది రాబోయే 5 సంవత్సరాలలో పేదరికాన్ని నిర్మూలించే లక్ష్యంలో ప్రజలను కీలక భాగస్వాములుగా చేస్తుంది.

జీరో పావర్టీ–పీ 4 కింద, ఆర్థికంగా సంపన్న కుటుంబాలు (మార్గదర్శి).. నిస్సహాయ (బంగారు కుటుంబం) కుటుంబాలను దత్తత తీసుకోవచ్చు. దత్తత తీసుకోవడం వల్ల వారి మధ్య దీర్ఘకాలిక, లోతైన ఒడంబడిక ఏర్పడుతుంది. బంగారు కుటుంబానికి సాధికారత కల్పించడానికి మార్గదర్శి కుటుంబం.. మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం అందిస్తుంది.

జీరో పావర్టీ- పీ 4 ప్లాట్‌ఫామ్...

ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకుని ప్రారంభిస్తున్న జీరో పావర్టీ–పీ 4 ప్లాట్‌ఫామ్, రాష్ట్రంలోని మార్గదర్శి కుటుంబాలు... 20 లక్షలకు పైగా బంగారు కుటుంబాలను ఎంచుకోవడానికి, దత్తత తీసుకోవడానికి వీలు కల్పించే డిజిటల్ ప్లాట్‌ఫామ్. ప్లాట్‌ఫామ్ లింక్: https://zeropovertyp4.ap.gov.in

మార్గదర్శి కుటుంబాలు వారి భౌగోళిక స్థానం లేదా కుటుంబ కూర్పు వంటి ఇతర జనాభా సమాచారం ఆధారంగా కుటుంబాలను గుర్తించవచ్చు. షార్ట్‌లిస్ట్ చేసుకోవచ్చు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా, కుటుంబాలు తమను తాము బంగారు కుటుంబం అని కూడా నమోదు చేసుకోగలుగుతారు. దీని ద్వారా ఆశావహ కుటుంబాలు మద్దతు పొందేందుకు వీలు కల్పిస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్ 'భాషిణి' భాషా సేవలను ఉపయోగించుకుంటోంది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ భాషా అనువాదాల కోసం రూపొందించినది.

రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు...

అన్ని సంపన్న కుటుంబాలు ఈ జీరో పావర్టీ– పీ 4 ప్లాట్‌ఫామ్‌లోకి లాగిన్ అయి కనీసం 1 బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని మార్గదర్శి కుటుంబంగా మారాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చారు.

అన్ని సంపన్న కుటుంబాలు తమ నెట్‌వర్క్‌లోని కనీసం 5 ఇతర కుటుంబాలను ఈ వేదిక ద్వారా దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

ఏపీలో పెట్టుబడులకు మదర్ డెయిరీ సిద్ధం

- కుప్పంలో ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదన

- రూ.150-200 కోట్ల వరకు పెట్టుబడి

ఢిల్లీ: ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ పాల పంపిణీ సంస్థ మదర్ డెయిరీ సిద్ధమైంది. మదర్ డెయిరీ సఫల్ పేరిట ఇప్పటికే పలుచోట్ల తాజా పండ్లు, కూరగాయల రిటైలింగ్‌లో ఉన్న ఈ సంస్థ చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.150–200 కోట్ల వరకు పెట్టుబడులతో ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మదర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ బాండ్లిష్ మాట్లాడుతూ.. రూ.600 కోట్లతో రెండు (గుజరాత్, ఆంధ్రప్రదేశ్) పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

గుజరాత్లోని బరోడా సమీపంలోని ఇటోలాలో రూ.400 కోట్ల వ్యయంతో ఒక ప్లాంటు ఏర్పాటు చేస్తామన్నారు. ఇది రెండేళ్లలో నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. ఇటోలాలోని ప్లాంటు రెండేళ్లలో పూర్తవుతుందన్న ఆయన.. కుప్పంలో ఏర్పాటుకు సంబంధించి తమకు భూకేటాయింపు జరగ్గానే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. దీనిపై ఇంకా డీపీఆర్ తయారుకాలేదన్నారు.

ప్రస్తుతం మదర్ డైరీ సఫల్ బ్రాండ్‌కు మూడు చోట్ల (బెంగళూరు, రాంచీ, మంగోల్ పురి –ఢిల్లీ) పండ్లు, కూరగాయల ప్రాసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ మూడు ప్లాంట్లలో ఏడాదికి రెండు లక్షల టన్నుల చొప్పున ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తున్నారు. మరోవైపు పాలు, పాల ఉత్పత్తులను ప్రాసెస్ చేసేందుకు రూ.500 కోట్లకు పైగా పెట్టుబడులతో న్యూ నాగ్‌పూర్‌లో ప్లాంటు నిర్మాణం జరుగుతోందని.. 2026 నాటికి అక్కడి కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని బాండ్లిష్ తెలిపారు. ఢిల్లీ–ఎన్‌సీఆర్ మార్కెట్లో ఇటీవల ఆవిష్కరించిన ఇడ్లీ–దోశె పిండికి వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. రోజుకు ఒక టన్ను చొప్పున తయారు చేస్తున్నట్లు చెప్పారు.

కృష్ణానదిపై 'ఆమ్రపాలి' బోట్ సేవలు

- ప్రారంభించిన ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ లోని పున్నమి ఘాట్ బెరం పార్క్ వద్ద కృష్ణానదిలో "ఆమ్రపాలి" పేరుతో కొత్త బోట్ సేవలను ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఆదివారం ప్రారంభించారు. పూర్తిస్థాయి నవీకరణలు చేసి, అన్ని ఆధునిక సౌకర్యాలతో ఈ బోటును పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ విజయవాడలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడానికి ఈ బోట్ సేవ ఒక ముఖ్యమైన మైలురాయి కానుందన్నారు. కృష్ణానది సుందర దృశ్యాలను ఇప్పుడు మరింత మంది పర్యాటకులు ఆస్వాదించగలుగుతారుని వివరించారు.

ఆమ్రపాలి బోటును ఒకేసారి అధిక సంఖ్యలో పర్యాటకులు ప్రయాణిం చేలా రూపుదిద్దారు. ఇందులో ఆధునిక భద్రతా వ్యవస్థలు, విశాలమైన సీటింగ్ ఏర్పాటు, ప్రథమ చికిత్సా సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. పర్యాటకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో కృష్ణానదిలో ప్రయాణిస్తూ ప్రకృతి సోయగాలు ఆస్వాదించేందుకు అన్ని వసతులు కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పర్యాటక రంగ నిపుణులు హాజరయ్యారు. డాక్టర్ బాలాజీ బోట్ సౌకర్యాలను పరిశీలించి, నావికులతో మాట్లాడి, భద్రతా నిబంధనలను కఠినంగా పాటించాలని సూచించారు.

టికెట్లు, ప్రయాణ వివరాలు

'ఆమ్రపాలి' కృష్ణానదిపై రోజుకు మూడు ట్రిప్పులు (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) తిరుగుతుంది. పర్యాటకులు ఆన్‌లైన్ లేదా

బెరం పార్క్ టికెట్ కౌంటర్ వద్ద టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ప్రతి ప్రయాణంలో కృష్ణానది చారిత్రక ప్రాముఖ్యత, పరిసర ప్రాంతాల గురించి గైడ్ వివరిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకాన్ని వేగవంతం చేయడానికి అనేక పథకాలు అమలు చేస్తోంది. విజయవాడలో కృష్ణానదిపై బోట్ టూర్లు వంటి ప్రాజెక్టులు స్థానిక ఆర్థిక వ్యవస్థకు తోడ్పడతాయని, కొత్త ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని ఛైర్మన్ అభిప్రాయపడ్డారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ మంది దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో అన్ని విధాలా సన్నద్ధమవుతున్నట్టు డాక్టర్ బాలాజీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా నిలపటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంలో వైభవంగా ఉగాది వేడుకలు

తిరుమల (చైతన్యరథం): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఆస్థానం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతం అనంతరం శుద్ధి నిర్వహించారు. ఆ తరువాత శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులువురు బోర్డు సభ్యులు పాల్గొన్నారు

శాంతి, సమృద్ధిగా అభివృద్ధి సాధించాలి

సాలూరులో ఘనంగా ఉగాది ఉత్సవాలు, పంచాంగ శ్రవణం, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, (చైతన్యరథం): సాలూరు శివాలయం రోడ్డులోని సీతారామ కళ్యాణ మండపంలో ఉగాది వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ, ఉగాది పండుగ తెలుగు సంప్రదాయానికి, భారతీయ సంస్కృతికి ప్రతిబింబం అని పేర్కొన్నారు. ఈ పర్వదినం కొత్త ఆశలతో, కొత్త సంకల్పాలతో ముందుకు సాగే రోజు. పంచాంగ శ్రవణం ద్వారా నూతన సంవత్సరంలో ఎదురుకాబోయే పరిణామాలను విశ్లేషించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి, సమృద్ధితో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే, ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి అనుకూలంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామనీ, ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించబోతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, విశిష్ట అతిథులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు, పెద్దలు పాల్గొని ఉగాది వేడుకలను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

నరసరావుపేటలో అక్షయ పాత్ర ఫౌండేషన్

80వ కేంద్రీకృత వంటగదికి భూమి పూజ

-రూ. 15 కోట్ల అంచనాలతో నిర్మాణం -15000 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భోజన సదుపాయం

- అన్నా క్యాంటిన్ లకు భోజనం సరఫరా - ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృషితో పల్నాట ఏర్పాటు

నరసరావుపేట, (చైతన్యరథం): దేశంలో ఆహార సమస్య, పోషకాహార లోపాలను పరిష్కరిస్తూ శుభ్రతతో రుచికరమైన భోజనాన్ని అందిస్తున్న అక్షయ పాత్ర వారి ఆహార పంపిణీ కేంద్రం పల్నాడులో ఏర్పాటు కాబోతోంది నరసరావుపేట మండలం, కేసానుపల్లి గ్రామ దగ్గరలో ఎకరం స్థలంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ వారి 80వ వంటగదికి "భూమి పూజ" వేడుకను ఆదివారంనిర్వహించారు. సుమారు రూ.15 కోట్ల అంచనాలతో కిచెన్ నిర్మాణం జరగనుంది. పల్నాడుతో పాటు పరిసర ప్రాంతాల్లోని 15000 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించే లక్ష్యంగా, అన్న క్యాంటీన్ లకు భోజనం పంపిణీ చేసేలా ఈ కిచెన్ నిర్మాణం జరుగుతుంది. ఈ సందర్భంగా టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పల్నాడు జిల్లాలో అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తున్నాం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,దాతల మద్దతుతో ఈ రోజు 80వ కేంద్రీకృత వంటగదికి భూమి పూజ చేసాము. అక్షయ పాత్ర పోషకమైన, హైజెనిక్, ఆహార భద్రత, పాఠశాల పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందించేదిగా గుర్తించబడిందని, నర్సరావుపేటలోని పాఠశాల పిల్లలు ఈ కార్యక్రమంతో ప్రయోజనం పొందుతారని, సమాజానికి గొప్ప సహకారం అందించినందుకు అక్షయ పాత్ర బృందం, దాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసన సభ్యులు చదలవాడ అరవింద్ బాబు, పల్నాడు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, అక్షయ పాత్ర ఫౌండేషన్, హరే కృష్ణ మూవ్మెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అధ్యక్షుడు వంశీధర దాసు, ట్రస్ట్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయచంద్రకు

ఉగాది శుభాకాంక్షలు

మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి నేతలు

పార్వతీపురం, (చైతన్యరథం): ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఉగాది పండుగ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఆదివారం అత్యధిక సంఖ్యలో నాయకులు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని పార్వతీపురం పట్టణం, మండలం, సీతానగరం బలిజిపేట మండలాలకు చెందిన తెదేపా, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కలుసుకొని ఎమ్మెల్యే విజయచంద్రకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వెలకట్టలేనిది రక్తదానం, దాతలు అభినందనీయులు

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, (చైతన్యరథం): రక్తదానం వెలకట్టలేనిదని రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమ పశుసంవర్ధక సహకార మార్కెటింగ్ మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రస్తుత వేసవిలో పేషెంట్స్‌కు ఎంతో అవసరం అన్నారు. రక్తం దొరక్క వారు చాలా ఇబ్బందులుకు గురవుతారని స్వచ్ఛంద సేవా సంస్థలు, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేసి పేషెంట్స్ కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదాతలు అభినందనీయులని అన్నారు. అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గం గొండు శంకర్ పర్యవేక్షణలో ఎన్టీఆర్ సేవా సంఘం, డేవిడ్ మాదారపు ఆధ్వర్యంలో, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ శ్రీకాకుళం నగరంలో స్థానిక 7 రోడ్స్ జంక్షన్‌లో అఖండ రక్తదానం నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం నిమ్మాడలో మంత్రి క్యాంప్ ఆఫీసులో శీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ కలిశారు. అనంతరం ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన కార్యక్రమం నిర్వహించిన డేవిడ్‌ను, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకును మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.

పాలకొల్లును అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా

- మంత్రి నిమ్మల రామానాయుడు ఉద్ఘాటన

పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, పాలకొల్లు పట్టణాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా పనిచేసి ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి పాలకొల్లులో ఆదివారం సాయంత్రం 27, 28, 1,8 వార్డుల్లో రూ.76 లక్షలతో చేపట్టిన సిమెంట్ రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో ఆయా వార్డుల ప్రజలు, మహిళలతో కలిసి భూమి పూజ జరిపి కొబ్బరికాయలు కొట్టారు. మంత్రి రామానాయుడుకు ప్రజలు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. మహిళలు హారతులు ఇచ్చి దీవించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాజకీయమంటే సంక్షేమం, సేవ అనేది కూటమి నాయకుల భావన అన్నారు. వైసీపీ నాయకులు మాత్రం స్వార్థంతో అధికారాన్ని అడ్డుపెట్టుకొని గూండాయిజం, రౌడీయిజం, దాడులు వంటి వాటికి పాల్పడుతుంటారన్నారు. అటువంటి వారికి సమాజంలోనూ, పాలకొల్లు నియోజకవర్గంలోనూ తిరగడానికి అర్హత లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2014 - 19 లో పాలకొల్లు పట్టణంలొ రూ. 240 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి సున్నా అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో తలపెట్టి 80 శాతం పూర్తిచేసిన బొండాడ వెంకటరాజు గుప్తా ఎన్టీఆర్ కళాక్షేత్రం, హిందూ శ్మశాన వాటిక, చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, డాక్టర్ అబ్దుల్ కలాం ఉద్యానవనం వంటి అభివృద్ధి

పనులు వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసానికి గురయ్యాయన్నారు. ఆయా పనులను మళ్లీ గాడిలో పెట్టి మిగిలిన పనులు పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి సారించానని, పనులు జరుగుతున్నాయని మంత్రి రామానాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణంలో రూ. కోట్లలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. గత జగన్ పాలన చెత్తపై పన్ను వేసి ప్రజలపై భారం మోపిన చెత్త ప్రభుత్వం అన్నారు. సీఎం చంద్రబాబు చెత్తపై పన్ను ను రద్దు చేశారన్నారు. రాష్ట్రానికి 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను జగన్ వారసత్వంగా ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం రైతాంగానికి ఉపయోగపడేలా కాలువలపై పెద్ద ఎత్తున పనులు, గ్రావెల్ రహదారులు వంటివి చేపడుతున్నట్లు మంత్రి రామానాయుడు చెప్పారు. జగన్ ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి ప్రజలను అబద్ధాలు, కల్లబొల్లి మాటలతో నమ్మించి ద్రోహం చేశాడని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడన్నారు. రాష్ట్ర అభివృద్ధి, భావితరాలతో పాటు భవిష్యత్ తరాలకు మంచి పాలన అందించే కూటమి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి అండగా ఉండాలని మంత్రి రామానాయుడు కోరారు.

ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ విజయ్ సారథి, డీఈ రాజకుమార్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన రోజా రమణి, గౌరు నాయుడు, తుల రామలింగేశ్వరరావు, సిడగం సురేంద్ర, బిట్ట లక్ష్మీనారాయణ, బీర వెంకటరమణ, బిర మధు, హరి నారాయణ, ముత్తాబత్తుల దొరబాబు, గుబ్బల ప్రసాద్, సలాది రాజ్యలక్ష్మి, పొట్నూరి అప్పన్న,, పిసిని రాము, పెండ్యాల భవాని, మీసాల రాము, కోరుకొండ సుబ్బారావు, విన్నకోట గోపి, పీతల శ్రీనివాస్, కొండేటి నరేష్, బాలి ఏడుకొండలు, ధనాన్ని సూర్యప్రకాష్, దుగ్గిన రాము, మజ్జి రామారావు, సబ్జీ, బాలి ఏడుకొండలు, వండెల రాంప్రసాద్, జగ్గు రోజు రాంబాబు, మల్లంపల్లి పకీర్ బాబు, వట్టం గణేష్, చిన్నిమిల్లి గణపతి, కొలుకులూరి జయప్రకాష్ నారాయణ, తోట వెంకటేశ్వరరావు, గాది వెంకన్న, మండ అవినాష్, కే సిహెచ్ పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ జరుపుకోవాలి

వేమిరెడ్డి దంపతుల శుభాకాంక్షలు

కోవూరు, (చైతన్యరథం): రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు క్షేమాన్ని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ముస్లిం సోదర సోదరీమణులకు, ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అందరూ ఆయురారోగ్యాలతో జీవించాలి

ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ శుభాకాంక్షలు

నెల్లూరు, (చైతన్యరథం): ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ముస్లిం సోదర సోదరీమణులకు, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, రంజాన్ క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయిక అని అన్నారు. మత సామరస్యానికి, పరస్పర సదవగాహనకు ప్రతీకగా రంజాన్ నిలుస్తోందని తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదరసోదరీమణులంతా నెలరోజులు కఠోరవ్రతం పాటించిన వారి శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలం లభించే రోజు రంజాన్ అన్నారు. ఈ మాసం వాతావరణం అంతా పుణ్య కార్యం,దైవభీతి అనే సుగుణాలతో నిండిందన్నారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అల్లాహ్ రక్షణ, కరుణ పొందాలనే లక్ష్యంతో రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, బీద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో ఎంతోకొంత దానధర్మాలు చేస్తూ సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారని పేర్కొన్నారు.

నేడు రంజాన్ కానుక పంపిణీ

ఎమ్మెల్యే చింతమనేని ఆధ్వర్యంలో ఏర్పాట్లు

చింతలూరు, (చైతన్యరథం): 'రంజాన్ సందర్భంగా దెందులూరు నియోజకవర్గంలోని పేద ముస్లింలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకం ఆధ్వర్యంలో భారీ రంజాన్ కానుకల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం తెల్లవారుఝాము నుంచి దెందులూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోని పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా మటన్ పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేశారు. దాదాపు 1.2టన్నుల మటన్‌ను నియోజకవర్గంలోని పేద ముస్లింలకు పంపిణీ చేయనున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రతి సంవత్సరం రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలోని పేద ముస్లింలకు వ్యక్తిగతంగా రంజాన్ కానుకను అందిస్తూన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముస్లిం మత పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం పెదవేగి మండలం రాయన్నపాలెం గ్రామానికి చెందిన ముస్లిం మత పెద్దలు,ప్రజలు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకంని కలిసి పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్ఎస్సెస్ శతాబ్ది ఉత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ

పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

విజయమూరు, (చైతన్యరథం): రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ శతాబ్ది ఉత్సవాల, క్యాలెండర్‌ను ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. శ్రీ విశ్వా వసు నామ సంవత్సరానికి సరిగ్గా 100 సంవత్సరాలు రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ నిండాయి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలను ఆర్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రచురించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ ద్వారా చేస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి బిజెపి ఇంచార్జ్ కదిరి రంగారావు, సత్యం, లెక్కమనేని రాజేష్, గువ్వల రవీంద్రారెడ్డి, అంకినపల్లి జయరాం రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, తదితరులు ఉన్నారు.

పిఠాపురంలో వైసీపీ నుండి టీడీపీలోకి

వర్మ ఆధ్వర్యంలో భారీగా చేరికలు

పిఠాపురం, (చైతన్యరథం): మున్సిపాలిటీలోని 28వ వార్డులో వైసీపీకి చెందిన కోసూరి వీరభద్రం, పిల్లాడ వీర వెంకటరమణ, సంబంగి మణి(తిరుపతి), పట్టాల ఆనంద సాగర్ కొమ్ము చంద్రమౌళి మిత్ర బృందం సుమారుగా 100 మంది దళిత యువత మరియు బి.సి.కి చెందిన నాయకులు పార్టీలో చేరారు. మాజీ ఎమ్మేల్యే వర్మ వీరి అందరికీ తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. వర్మ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ నాయకత్వం మెచ్చి, అదే విధంగా పార్టీ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై రావడం జరిగిందని తెలిపారు. వీరికి ఏ కష్టం వచ్చిన, ఏ ఇబ్బందులు ఉన్న తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సోము సత్యనారాయణ, కోరుప్రోలు శ్రీను, అల్లవరపు నగేష్, సురవరపు సుబ్బారావు, ఎర్రంశెట్టి శ్రీను, పిల్లి చిన్న, మూర్తి, పొలిమేరు ప్రకాష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ స్థాయి ఎడ్ల బలాలు, పశుపాల ప్రదర్శన

పాల్గొన్న కేంద్రమంత్రి పెమ్మసాని, రాష్ట్రమంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, సమర్థవంతంగా నిర్వహించిన ఆలపాటికి అభినందనలు

తెనాలి, (చైతన్యరథం): ఆలపాటి శివరామ కృష్ణయ్య మెమోరియల్ ట్రస్టు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలి మార్కెట్ యార్డులో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు జరుగుతున్న ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పశుపాల ప్రదర్శన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,మంత్రి నాదెండ్ల మనోహర్, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు, జడ్పీ చైర్మన్ హెన్రీ క్రిస్టియనా, లీడ్ క్యాప్ చైర్మెన్ పిల్లి. మాణిక్యరావు,మాజీ మహిళా కమిషన్ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూల మాల వేసి నివాళ్ళు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎడ్ల బల ప్రదర్శనను ప్రారంభించారు. వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శన ప్రాంగణాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఎడ్ల బల ప్రదర్శన ప్రాంగణంలో రైతులను పలకరిస్తూ ప్రాంగణం అంతా ఎడ్ల బండిపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నాదెండ్ల మనోహర్,ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తిరిగారు. ఇంకా కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు పోటీలు ప్రారంభించామన్నారు. గత 5ఏళ్లు వైసీపీ దుర్మార్గపు పాలన జరిగిందన్నారు. గత పాలనలో క్రీడలను నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎడ్ల బల ప్రదర్శనతో రైతుల కోసం విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దృఢమైన శరీరం, నడకలో రాజసంతో ఒంగోలు జాతి పశుసంపదను చూస్తుంటే ఇక్కడ పండగ వాతావరణం కనపడుతోందన్నారు. ఎడ్ల పోటీల, వ్యవసాయం సాంకేతిక పరిజ్ఞానం విజన్ పట్టుదల ప్లానింగ్ ఉండాలన్నారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన రాజేంద్రప్రసాద్‌లో ఆ దృఢత్వం కనపడుతుందన్నారు. ఎడ్ల ప్రదర్శన ప్రాంగణం ఎంతో అద్భుతంగా ఉందన్నారు. ఇక్కడికి రావటం ఎడ్ల పోటీల్లో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మన సంస్కృతి ఉట్టి పడేలా ఎడ్ల పోటీలు చేపట్టిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి అభినందనలు తెలిపారు. కొత్త స్ఫూర్తితో వెళ్తున్న ముఖ్యంత్రి చంద్రబాబుకి అండగా నిలబడాలన్నారు. అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు అండగా నిలబడాలన్నారు. గత పాలకులకు వ్యక్తిగతంగా లబ్ధి తప్ప ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు పట్టవన్నారు. ఎడ్ల పోటీలు మంచి స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లి పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

పేదల గొంతులు ఎండగట్టిన వైసీపీ మూకలు

చంద్రబాబుకు పేరొస్తుందని తాగునీటీ పథకాన్ని మూసేసిన అవినీతి మంత్రి, ఉగాది నాడు కాంటినెంటల్ కాఫీ , వరప్రసాద్‌ల నిధులతో ప్లాంట్ పున: ప్రారంభించడం సంతోషం : మాజీ మంత్రి పుల్లారావు

చిలకలూరిపేట, (చైతన్యరథం): దాదాపు 30 గ్రామాలకు తాగునీరు అందించే తాగునీటి పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు వైసీపీ నేతల తీరుపై విరుచుకుపడ్డారు. టీడీపీ హాయాంలో సీఎస్ఆర్ నిధులతో రూ.4కోట్లతో ప్రారంభించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని అవినీతి మంత్రి నిరుపయోగంగా మార్చారన్నారు. ఆ పథకాన్ని ఉగాదినాడు పున: ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆనాడు తాగునీటి పథకం ప్రారంభానికి ముఖ్యమంత్రి సతీమణి, భువనేశ్వరి ఎంతో చొరవ చూపారన్నారు. ఆదివారం ఆయన పట్టణ శివారులో మంచినీటి చెరువు పక్కన ఉన్న తాగునీటి ప్లాంట్‌ను పున:ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తాగునీటి పథకానికి అన్ని అనుమతులు ఉన్నా గత ప్రభుత్వం కేవలం టీడీపీకి పేరు వస్తుందన్న దురుద్దేశంతోనే ప్లాంట్‌ను నిలిపివేసిందని ప్రత్తిపాటి తెలిపారు. గతప్రభుత్వంలోనే పాడైపోయిన బోర్ల స్థానంలో రూ.20లక్షలతో కొత్తవి ఏర్పాటుచేసి పథకం ప్రారంభించడానికి ప్రయత్నిస్తే, టీడీపీ ముఖ్య నాయకులపై తప్పుడు అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారని ప్రత్తిపాటి తెలిపారు. 5 ఏళ్ల పాటు తాగునీటి ప్లాంట్ మూసివేసి, పట్టణంలోని 8 వార్డులు, 30 గ్రామాలకు తాగునీరు లేకుండా చేసిన పాపం గత ప్రభుత్వానిదేనని మాజీమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి పథకానికి తమపార్టీ పేరు, నాయకుడి పేరు పెట్టి నడుపుకోవచ్చని గతంలో అవినీతి మంత్రి చెప్పడం జరిగిందన్నారు. ఎవరో ప్రారంభించిన పథకాలకు వారి పేర్లు పెట్టుకోవడానికి వారికి సిగ్గుకూడా లేదన్నారు.కాంటినెంటల్ కాఫీ రూ.15లక్షలు, కే.ఎమ్.ఈ. వరప్రసాద్ రూ.10లక్షల సీ.ఎస్.ఆర్ నిధులతో తాగునీటి పథకాన్ని పున: ప్రారంభించడం జరిగిందని

పుల్లారావు చెప్పారు. పల్నాడుజిల్లాలో మరెక్కడా ఇటువంటి భారీ తాగునీటి ప్లాంట్ లేదన్నారు. ప్లాంట్ నిర్వాహకులు లాభాపేక్ష లేకుండా కేవలం సిబ్బంది జీత భత్యాలకు, విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వినియోగదారుల నుంచి నామమాత్రంగా 20లీటర్లకు రూ.5లు తీసుకుంటున్నారని పుల్లారావు చెప్పారు.

ఒంగోలు నగరంలో ఘనంగా ఉగాది వేడుకలు

పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఒంగోలు, (చైతన్యరథం): నగరంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉగాది సంబరాల్లో భాగంగా జిల్లా యంత్రాంగం శ్రీ విశ్వా వసు నామ సంవత్సర ఉగాది ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించింది. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

గుర్రం వెంకయ్యకు మాలేపాటి పరామర్శ

వెంటవెళ్లిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

దగదర్తి, (చైతన్యరథ): గదర్తి మండలం, చెన్నూరు గ్రామ వాస్తవ్యులు గుర్రం వెంకయ్య ట్రాక్టర్ ప్రమాదం కారణంగా నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని, చెన్నూరులోని వారి స్వగృహం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వీరితోపాటు తెలుగుదేశం పార్టీ నేతలు పి రమణమ్మ, నిజం అంకబాబు, అద్దంకి రమణయ్య, సీనయ్య, గుంటూరు రమేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చెన్నూరు గ్రామ ప్రజలు ఉన్నారు.

మాజీమంత్రి కాకాణి ఇంటికి పోలీసులు

నెల్లూరు, (చైతన్యరథం): అక్రమ మైనింగ్, పేలుడు పదార్థాల వినియోగం సహా రవాణా కేసులో మాజీమంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి ఇంటికి పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు వెళ్లారు. కాకాణి ఇంటికి తాళాలు వేసి ఉండడంతో గోడకు నోటీసులు అతికించారు. కాకాణి, ఆయన పీఏ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. నోటీసుల ప్రకారం నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం 11 గంటలకి కాకాణి విచారణకు హాజరుకావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఉదయగిరిలో ఉగాది వేడుకలు

ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు

ఉదయగిరి, (చైతన్యరథం): తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పవిత్రమైన పండుగ ఉగాది సందర్భంగా యావత్ తెలుగు ప్రజలందరికీ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ప్రవీణ దంపతులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ"ఉగాది నూతన హంగులను, ఉత్తేజాన్ని, స్ఫూర్తిని అందించే విశిష్టమైన పండుగ. ఈ విశ్వవసునామ సంవత్సర ఉగాది కొత్త ఆశయాలకు, అభివృద్ధి సంకల్పాలకు శ్రీకారం చుట్టే సందర్భం. తెలుగు భాష గొప్పతనాన్ని, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే ఈ ఉత్సవం ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. దేవతల కృపా కటాక్షాలతో రాష్ట్రం అభివృద్ధి బాటలో మరింత ముందుకు సాగాలి. భక్తుల భగవత్ స్మరణ నిలువెల్లా పరిపూర్ణంగా ఉండాలి." అని తెలిపారు. ఈ విశ్వావసునామ ఉగాది సంవత్సరంలో ప్రతి కుటుంబానికి సుభిక్షత, ఆరోగ్యం, శాంతి కలగాలని, రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా, సంపదతో, ఐక్యతతో కొనసాగాలని కోరుకుంటూ మరోమారు అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

నెల్లూరీయులకు ఉగాది పురస్కారాలు

నెల్లూరీయులకు ఉగాది పురస్కారాలు, అభినందించిన టీడీపీ శ్రేణులు

నెల్లూరు, (చైతన్యరథం): ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలు పేరుతో కళాకారులకు కవులకు పురస్కారాలు అందచేస్తూ, తెలుగు సంస్కృతి ,సంప్రదాయాల పరిరక్షణకు దోర్నాల హరిబాబు కృషి చేస్తున్నారు. నెల్లూరు కామెడీ పేరుతో నెల్లూరు యాసలో అందరినీ అలరిస్తున్న హరిబాబుకు రాష్ట్ర ప్రభుత్వ కళారత్న అవార్డు దక్కింది. ఇది అతని ప్రతిభకు దక్కిన గౌరవమని టీడీపీ నేతల అభినందిస్తున్నారు. నెల్లూరు లో కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి, 25 కళా సంఘాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 25 కళాసంఘాల పర్యవేక్షణలో ప్రముఖ నటుడు దోర్నాల హరిబాబు ఆధ్వర్యంలో నెల్లూరులోని టౌన్ హాల్‌లో జరిగిన హరివిల్లు క్రియేషన్స్ వారి హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమమునకు ముఖ్యతిథిగా తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూలి అంతరించి పోతున్న తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కొరకు ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలు పేరుతో కళాకారులను కవులను ఎంపిక చేసి వారికి పురస్కారాలు అందచేస్తూ తద్వారా తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం దోర్నాల హరిబాబు తన శక్తికి మించి కృషి చేస్తున్నారన్నారు. హరివిల్లు క్రియేషన్స్ ఏర్పాటు చేసి గత 11 సంవత్సరాలుగా ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తూ వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన అనేక మందిని ఎంపిక చేసి వారిని సన్మానించి ,వారికి పురస్కారాలు అందిస్తూ కళా రంగానికి హరిబాబు తన చేతనైన సేవ చేస్తున్నారన్నారు. నెల్లూరు కామెడీ పేరుతో నటుడిగా నెల్లూరు యాసలో అందరినీ అలరిస్తున్న హరిబాబుకు మన రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా కళారత్న(హంస) అవార్డు ను ప్రకటించింది. ఇది అతని ప్రతిభకు తగిన సత్కారం. ఈ అవార్డుకు ఎంపికైన హరిబాబు కు అభినందనలు తెలియచేస్తూ వారు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. రోజు, రోజుకూ అంతరించి పోతున్న నాటక రంగాన్ని, ప్రాచీన కళలు పరిరక్షణకు

అమరావతి కృష్ణారెడ్డి వారి మిత్ర బృందం విశేషమైన కృషి చేస్తున్నారు. వారికి ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. తెలుగు దేశం పార్టీ సింగర్ నెల్లూరు జిల్లా గర్వించదగ్గ గాయకుడు ఎస్పీ బాలు శిష్యుడు ప్రవీణ్‌కుమార్ సీఎం చంద్రబాబు చేతులతో ప్రతిభా పురస్కారం ఇప్పుడు మళ్ళా ఆయన చేతులు మీదుగానే ఉగాది పురస్కారం అందుకున్న సందర్భంగా పలువురు నెల్లూరు వాసులు ఆయనను అభినందించారు.

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం

రూ. 20 లక్షలతో ప్రభుత్వ హెూమియో ఆసుపత్రి నిర్మాణం : కార్మిక శాఖ మంత్రి సుభాష్

అనపర్తి, చైతన్యరథం): ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం అనపర్తి మండలం రామవరంలో ప్రభుత్వ హెూమియో ఆసుపత్రిని మంత్రి సుభాష్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట ఎమ్మెల్యే

వేగుళ్ళ జోగేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రపంచంలో హెూమియో వైద్యానికి చాలా ప్రాముఖ్యత ఉందని, ఈ వైద్యం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసిన చరిత్ర ఉందన్నారు. అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి గత 39 సంవత్సరాల క్రితమే హెూమియో వైద్యం యొక్క విశిష్టతను గుర్తించి రామవరంలో హెూమియో ఆస్పత్రికి ప్రారంభించడం అభినందించదగ్గ విషయం అన్నారు. ప్రస్తుతం ఆ ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక సచివాలయంలో ఆసుపత్రిని ప్రారంభించామని మంత్రి సుభాష్ తెలిపారు. త్వరలోనే రూ. 20 లక్షలు వెచ్చించి నూతన ఆసుపత్రి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయ్యాక పూర్తిస్థాయిలో వైద్యులను సిబ్బందిని నియమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ళ జోగేశ్వరరావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమ కోసం బడ్జెట్లో తగిన నిధులు కేటాయించిందన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు హెూమియో వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గిరిడా గంగా భవాని, కుతుకులూరు సర్పంచ్ హేమ తులసి, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల్లో దామచర్ల సత్య

బిట్రగుంట, (చైతన్యరథం): ఉగాది పండుగను పురస్కరించుకొని జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామంలో జరుగుతున్న ఉగాది ఉత్సవాలలో భాగంగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రత్యేక పూజ కార్యక్రమంలో రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు తెలుగు రైతు ఉపాధ్యక్షుడు పోటు పెద బాబు ,మండల పార్టీ అధ్యక్షులు పోకూరి రవీంద్ర బాబు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకాని నివాసంలో ఎమ్మెల్యే కాకర్ల తేనేటి విందు

దంపతులకు సాదర సత్కారం

బిట్రగుంట, కావలి నియోజకవర్గం బిట్రగుంట గ్రామానికి చెందిన చిరకాల మిత్రుడు కాకాని చంద్రశేఖర్ నివాసంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రవీణ దంపతులు ఆదివారం మధ్యాహ్నం తేనేటి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కాకాని చంద్రశేఖర్‌కు చెందిన గోశాలను పరిశీలించారు. లాభనష్టాలను అడిగి తెలుసుకున్నారు. పశు పోషణ ద్వారా అనేక లాభాలు ఉన్నట్లు గుర్తించారు. గోశాలలోని లేగ దూడకు శ్రీమతి కాకర్ల ప్రవీణ తమ చేతుల మీదుగా ఆహారాన్ని అందించారు. గోశాలలోని ఆవులు, గేదెలు, లేగ దూడలను చూసి ఆనందించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి గత స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది, నాయకులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కాకర్ల రంజాన్ శుభాకాంక్షలు

సంతోషంగా జీవించాలని ఆకాంక్ష

ఉదయగిరి, (చైతన్యరథం): పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అన్నారు. రంజాన్ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గం లోని ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, ఆనందంగా పండుగ చేసుకోవాలని ఆకాంక్షించారు. అల్లాహ్ దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని.., క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పర్వదినం అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాసం చేస్తూ.. దైవ ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. ముస్లింల అత్యంత పవిత్రమైన గ్రంథంగా ఖురాన్ అవతరించిందన్నారు. రాష్ట్రం నెల్లూరు జిల్లాలోని ముస్లింలకు ఎమ్మెల్యే రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వ్యక్తిగత గొడవల్ని పార్టీలకు ఆపాదించొద్దు

పాపిరెడ్డిపల్లి సంఘటన అనుకోకుండా జరిగింది ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ప్రకటన

రాప్తాడు, (చైతన్యరథం): రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో జరిగిన సంఘటనకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. గ్రామంలో ఉగాది పండుగ నేపథ్యంలో కొందరు తమ పెద్దల సమాధుల వద్ద, దేవాలయం వద్ద పూజలు చేసి వస్తుండగా.. ఒక చిన్న సంఘటనతో ఈ గొడవ మొదలైందన్నారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారని అన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి మరణించడం చాలా బాధాకరమని పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత గొడవలతో జరిగిన సంఘటనలను కూడా వైసిపి నాయకులు పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు ఆపాదిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటివరకు పాపిరెడ్డి పల్లి గ్రామంలో ఎలాంటి ఫ్యాక్షన్ గొడవలు లేవని వారు గుర్తు చేశారు. ఒక వ్యక్తి మరణాన్ని రాజకీయంగా వాడుకునేందుకు వైసిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని... ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. పాపిరెడ్డి పల్లి గ్రామంలో జరిగిన సంఘటన పూర్తిగా వ్యక్తిగత కారణాలతోనేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలు, రాజకీయ గొడవలను తెలుగుదేశం పార్టీ మరీ ముఖ్యంగా పరిటాల కుటుంబం ప్రోత్సహించదని సునీత, శ్రీరామ్ అన్నారు.

ఎమ్మెల్యే పరిటాల పోరాటాలపై మరో పాట

వెంకటాపురంలో సీడీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత,

వెంకటాపురం, (చైతన్యరథం): ఎమ్మెల్యే పరిటాల సునీత జీవిత సంఘటనలు, ఆమె చేసిన పోరాటాలు, రాజకీయ జీవితంపై మరో పాట రూపొందించారు. హైదరాబాద్ లోని జీడిమెట్లకు చెందిన తాతినేని సాయి చరణ్(బాబీ) ఈ పాటకు రూపకల్పన చేశారు. మొత్తం తెలంగాణ మాండలికంలో ఉన్న ఈ పాటను ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్ (నర్సన్న) పాడారు. పోరాటాల పొద్దువు నీవే.. అమ్మ సునీతమ్మ, పేద బిడ్డల తల్లివే సునీతమ్మ అంటూ ఈ పాట మొదలవుతుంది. ఈ పాటలో ఎమ్మెల్యే సునీత నిజ జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, పార్టీ కోసం చేసిన పోరాటాలు, ఆమె మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అందించిన సేవలు.. ఇలాంటి అనేక అంశాలతో పాటను తయారు చేశారు. ఈ పాటకు సంబంధించిన సీడీని ఉగాది పండుగ సందర్భంగా రామగిరి మండలం వెంకటాపురంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ జరిగింది. ఈసందర్భంగా సాయిచరణ్ మాట్లాడుతూ తాను మొదటి నుంచి పరిటాల అభిమానిగా ఉన్నానని.. ఆ కుటుంబం పై ఉన్న ప్రేమతోనే ఈ పాటను తయారు చేసినట్టు చెప్పారు. ప్రజల కోసం జీవితాల్ని త్యాగం చేసిన కుటుంబం పరిటాల వారిదని చరణ్ అన్నారు.

రంగడి సేవలో మంత్రి నారాయణ దంపతులు

పెన్నా స్నాన ఘట్టంలో భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామన్న మంత్రి

నెల్లూరు, విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ రమాదేవి దంపతులు ఆదివారం శ్రీ తల్పగిరి రంగనాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవస్థానం కమిటీ నిర్వాహకులు అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ మంత్రి నారాయణ దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం ఆలయ ప్రధాన అర్చక స్వాములు తీర్థప్రసాద వినియోగాలు అందజేసి మంత్రి నారాయణ దంపతులకు పేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19లో తాను మంత్రిగా ఉన్న సమయంలో ఆలయ పూజారులు భక్తుల విన్నపం మేరకు రంగనాయక స్వామి పెన్నఘాట్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా ఘాట్ ను విస్తరించాలని అడిగారన్నారు. ఘాట్ అభివృద్ధి విషయంలో అధికారులతో చర్చించామన్నారు. దేవాలయాల పరిరక్షణ ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం బాధ్యత రాహిత్యంగా వ్యవహరించిందని, రివర్స్ టెండరింగ్ పేరుతో ఆలయాల ప్రతిష్టలను పూర్తిగా దెబ్బతీసిందన్నారు.

వైకాపా హయాంలో తిరోగమనం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల్లో భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తున్నామని, రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లు పిలిచి నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు

ఛత్తీస్‌గఢ్‌కు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నా

- రూ.33,700 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన - బిలాస్‌పూర్ పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీ

రాయపూర్: ఛత్తీస్‌గఢ్‌లో రూ.33,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆదివారం ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. విద్యుత్, చమురు-సహజవాయువు, రైల్వేస్, రోడ్లు వంటి కీలక రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. బిలాస్‌పూర్‌లో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు దక్కేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో 3 లక్షల మందికి పేద ప్రజలకు కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ ని నెరవేర్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. నవరాత్రి తొలిరోజునే బిలాసపూర్‌లో వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నవరాత్రుల తొలిరోజు ఇక్కడ ఉండటం నా అదృష్టంగా భావి స్తున్నాను. మాతా మహామాయి సొంత గడ్డ ఇది. కౌసల్యా దేవి పుట్టినిల్లు కూడా ఇదే. శక్తిమాతను ఆరాధించే ఈ తొమ్మిది రోజులు ఛత్తీస్‌గఢ్ ప్రజలకు చాలా ప్రత్యేకం. ఈ శుభతరుణంలో ఇక్కడకు రావడం ఆనందంగా ఉంది" అని మోదీ అన్నారు. కొద్ది నిమిషాల క్రితమే రూ.33,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు మొదలయ్యాయని, వీటిలో పేదలకు ఇళ్లు, స్కూళ్లు, రోడ్లు, రైల్వేలు, విద్యుత్, గ్యాస్ పైప్‌లైన్స్ వంటి ప్రాజెక్టు లు ఉన్నాయని చెప్పారు. ఇవన్నీ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఉద్దేశించిన వని, ఈ గణనీయమైన అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానని అన్నారు.

ఛత్తీస్‌గఢ్ సిల్వర్ జూబ్లీ ఇయర్

ఛత్తీస్‌గఢ్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తవుతున్న 'సిల్వర్ జూబ్లీ ఇయర్' ఇదని మోదీ అన్నారు. ఈ ఏడాదే అటల్ బిహారీ వాజ్‌పేయి శతాబ్ది సంవత్సరం కూడా అని గుర్తుచేసుకున్నారు. 2000లో వాజ్‌పేయి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది.

ఆటవిక రాజ్యం కావాలో..

అభివృద్ధి కావాలో తేల్చుకోండి

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పిలుపు

పాట్నా: ఈ ఏడాది చివర్లో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు జంగిల్ రాజ్‌ను కోరుకుంటారో, మోదీ సారథ్యంలో అభివృద్ధిని కోరుకుంటారో తేల్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కోరారు. ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ నేత సోనియాగాంధీ బీహార్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. నరేంద్ర మోదీ ప్రభు త్వంలోనే బీహార్ అభివృద్ధి బాట పట్టిందని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజలు తిరిగి పట్టం కట్టాలని, ఐదేళ్లలోనే రాష్ట్రాన్ని వరదల నుంచి విముక్తి కలిగిస్తామని భరోసా ఇచ్చారు. లాలూప్రసాద్ సొంత జిల్లా గోపాల్‌గంజ్‌లో ఆదివారం అమిత్‌షా మాట్లాడు తూ లాలూ-రబ్రీ జంగిల్ రాజ్ కావాలో, నరేంద్రమోద-నితీష్ కుమార్‌ల అభివృద్ధి బాట కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు. 65 ఏళ్లుగా కాంగ్రెస్ చేయలేదని మోదీ పదేళ్లలో చేసి చూపించారని చెప్పారు. బీహార్‌లో లాలూ-రబ్రీ హయాం, కేంద్రలో సోని యా-మన్మోహన్ ప్రభుత్వం హయాంలో బీహార్‌కు చేసిందేమీ లేదన్నారు. ఇప్పుడు లాలూ కుమారు లిద్దరూ సీఎం పదవి కోసం సిద్ధమవుతున్నారని, ఆయన భార్య రబ్రీదేవి ఇక్కడ ఎమ్మెల్సీగా ఉందని అన్నారు. తన కుటుంబాన్ని చక్కిదిద్దుకోవడంలో లాలూ బీజీగా ఉన్నారని, రాష్ట్రంలోని యువత గురించి మాత్రం ఏమాత్రం పట్టింపులేదని, నరేంద్ర మోదీ మాత్రం యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని చెప్పారు.

బీహార్‌లో జానకీ మందిరం

నరేంద్రమోదీ ప్రభుత్వం అయోధ్యలో రామమందిరం నిర్మిం చినట్టే బీహార్‌లోనూ మాతా జానకి మందిరం నిర్మించే యోచన లో ఉన్నారని అమిత్‌షా చెప్పారు. ఛాత్ పం డుగకు సెలవులను బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. బీహార్ అభివృద్ధికి కేంద్రం రూ.9 లక్షల కోట్లు కేటాయించిందని, 13 గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మాణం కానున్నాయని, రూ.8,000 కోట్లతో ఏడు వంతెనలు నిర్మిస్తామని, బీహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు. బీహార్ అభివృద్ధికి కట్టుబడిన మోదీ-నితీష్ నాయకత్వాన్ని తిరిగి బీహార్ ప్రజలు గెలిపించాలని కోరారు.

గుజరాత్ జంగిల్ రాజ్ హీరో మీరే: ఆర్జేడీ

ఆర్జేడీ హయాంను జంగిల్ రాజ్‌గా పోలుస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆర్జేడీ ప్రతినిధి శక్తి యాదవ్ తిప్పికొట్టారు. గుజరాత్ జంగిల్ రాజ్ హీరోగా అమిత్‌షాను ఆయ న అభివర్ణించారు. "బీహార్‌లో 20 ఏళ్లు జేడీయూ-బీజేపీ ప్రభుత్వమే ఉంది. శాంతి భద్రతల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. బీహార్ అభివృద్ధికి బీజేపీ ఏం చేసిందే చెప్పాలి. విద్య, తలసరి ఆదాయం, పెట్టుబడుల విషయంలో బీహార్ విఫలమైం ది. వలస కార్మికుల్లో బీహార్ ప్రజలే అగ్రస్థానంలో ఉన్నారు. బీహార్‌ను కొల్లగొట్టడం మినహా ఎన్డీయే చేసిందేమీ లేదు" అని శక్తి యాదవ్ అన్నారు. బీహార్ ప్రజలకు ఈ వాస్తవాలన్నీ తెలుసుననీ, వారు రాష్ట్రంలో మార్పునే కోరుకుంటున్నారని చెప్పారు.

ఆధునిక 'అక్షయ వటవృక్షం' ఆర్ఎస్ఎస్: మోదీ

నాగపూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను భారతీయ సజీవ సంస్కృతికి చిహ్నమైన ఆధునిక "అక్షయ వటవృక్షం"గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణిం చారు. దేశానికి ఆర్ఎస్ఎస్ వలంటీర్లు చేస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడారు. దేశనిర్మాణం, సమాజ సేవ, సంస్కృతీ పరిరక్షణలో విశిష్ట సేవలందిస్తున్నారని అన్నా రు. నాగపూర్‌లోని మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు ప్రధాని ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆర్ఎస్ఎస్ విశిష్టతను ప్రధాని వివరిస్తూ... "వందేళ్ల క్రితం నాటిన సిద్ధాంతాల విత్తనాలు ఈనాడు వటవక్షంలా ప్రపంచ ముందున్నాయి. సిద్ధాం తాలు పతాకస్థాయికి చేరుకోగా, లక్షలు, కోట్ల మంది స్వయం సేవకులు ఈ వట వృక్షానికి కొమ్మలు. ఇది మామూలు వటవృక్షం కాదు. భారతీయ సంస్కృతికి చిహ్న మైన ఆధునిక వటవృక్షం" అని అన్నారు. గుడి పడ్వా (మరాఠీ నూతన సంవత్సర పండుగ) సందర్భంగా ప్రజలందరికీ ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. "వరుస పం డుగల సీజన్ ఇది. గుడి పడ్వా, ఉగాది, నవ్రేహ్ (కశ్మీరీ హిందూ నూతన సంవత్స రం) పండుగలను దేశవ్యాప్తంగా ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటున్నారు. ఇదే ఏడాది ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరం కూడా వచ్చింది. స్మృతి మందిర్‌కు నివాళులర్పించే మహదవకాశం నాకు వచ్చింది. ఇటీవలే మనం 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకొన్నాం. వచ్చే నెలలో బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవం ఉంది. నవరాత్రి, ఇతర పండుగల సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా ను" అని ప్రధాని అన్నారు. పేదలకు ఉత్తమమైన వైద్యసేవలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ప్రధాని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లాది మందికి ఉచిత వైద్యసేవలు అందుతున్నాయని, దేశప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించడం తమ ప్రాధాన్యతా క్రమాల్లో ఒకటని తెలిపారు. వేలాది జన్ ఔషధి కేం ద్రాల ద్వారా దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు చౌకగా మందులు లభిస్తున్నా యని అన్నారు. ఇందువల్ల వేలకోట్లలో ప్రజల సొమ్ము ఆదా అవుతోందని చెప్పారు. గత పదేళ్లలో లక్షలాది ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను గ్రామాల్లో నిర్మించామని, అక్కడ ప్రాథమిక చికిత్స లభిస్తోందని

వివరించారు. మెడికల్ కాలేజీలను రెట్టింపు చేయడంతో పాటు దేశంలో ఆపరేషనల్ 'ఎయిమ్స్'ను మూడురెట్లు పెంచామని చెప్పారు. నిపుణులైన వైద్యులను ప్రజలకు అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని అన్నారు.

మాధవ్ నేత్రాలయ భవంతికి శంకుస్థాపన

మాధవ్ నేత్రాలయ ఐ ఇన్‌స్టిట్యూ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో కొత్తగా ఎక్స్‌టెన్షన్ బిల్డింగ్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి తదితరులు పాల్గొన్నారు. నాగపూర్‌లోని సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ సెంటర్‌ను 2014 లో దివంగత ఆర్ఎస్ఎస్ చీఫ్ మాధవరావు సదాశివరావు గోల్వాల్కర్ అలియాస్ గురూజీ స్మృత్యర్థం నిర్మించారు. కొత్త ప్రాజెక్టుతో 250 పడకల ఆసుపత్రిగా, 14 ఔట్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్స్, 14 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు చవకగా అందుబాటులోకి రానున్నాయి.

మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ

మోదీ పర్యటన వేళ.. 50 మంది లొంగుబాటు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతోన్నాయి. అలాంటి వేళ బీజాపూర్ జిల్లాలో పోలీసులు ఎదుట భారీగా మావో యిస్టులు లొంగిపోయారు. దాదాపు 50 మంది మావోయిస్టులు ఆదివారం పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మావోయిస్ట్ కీలక నేత రవీంద్ర సైతం ఉన్నారు. లొంగిపోయిన వారిలో 14 మందిపై రూ.68 లక్షల రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇక మరోవైపు ప్రధాని మోదీ ఈ రోజు అంటే ఆదివారం.. మార్చి 30వ తేదీ ఛత్తీస్‌గఢ్‌లో పర్యటన నేపథ్యంలో కొన్ని గంటల ముందు ఇంత భారీగా మావోయిస్టులు లొంగిపోవడం గమనార్హం. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయడమే కాదు.. ఓ నిర్దిష్ట లక్ష్యాన్ని కూడా నిర్దేశించు కొంది. అందులోభాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం.. మావోయిస్టులకు రక్షణ కవచంగా ఉంది. ఈ నేపథ్యంలో పోలీసులు, భద్రతా సిబ్బంది సంయుక్తంగా ఆ ప్రాంతంలో కూబింగ్ నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య పలు సందర్భాల్లో జరిగిన హోరా హోరీ కాల్పుల్లో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. తాజాగా మార్చి 29వ తేదీన సైతం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో దాదాపు 18 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో 11 మంది మహిళలే ఉన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 134 మంది మావోయిస్టులు మరణించారు. అలాగే ఏడు వందలకు పైగా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇంకోవైపు వరుస ఎన్‌కౌం టర్ ఘటనలపై కేంద్రం సైతం స్పందిస్తుంది. ఆపరేషన్ కగార్ లక్ష్యంగా జరుగుతోన్న ఈ ఎన్‌కౌంటర్ల వల్ల మావోయిస్టులు ఉనికిని కోల్పోతున్నారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్లపై మావోయిస్టు పార్టీ సైతం స్పందించింది. ఈ ఎన్‌కౌంటర్లకు నిరసనగా మార్చి 4వ తేదీ శుక్రవారం బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు లేఖను విడుదల చేసింది అదీకాక.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రాబల్యం బాగా తగ్గిపోయింది. కానీ ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం వారి ప్రభావం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో మావోయిస్టు లు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసి పోవాలని కేంద్రం ఇప్పటికే పిలుపు నిచ్చింది. అలాగే లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తామని ప్రకటిం చింది. అయితే మావోయిస్టులు మాత్రం లొంగిపోయేందుకు ఏ మాత్రం ముందుకు రావడం లేదు. ఓ వేళ వచ్చిన చాలా కొద్ది మంది మాత్రమే లొంగిపోతు న్నారు. కానీ ఇలా 50 మంది మావోయిస్టులు ఒకే సారి లొంగి పోవడం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. ఇంకోవైపు మార్చి 29వ తేదీ వరుసగా రెండు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్న మరునాడే.. ఇలా మరో 50 మంది మావోయిస్టులు లొంగిపోవడం పట్ల పోలీసులు, భద్రతాధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది మావోయిస్టులు లొంగిపోతారని వారు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

మయన్మార్‌లో మృత్యుఘోష

1644కు చేరిన మృతుల సంఖ్య - ముమ్మరంగా సహాయక చర్యలు - మరోసారి కంపించిన భూమి - రెండురోజుల వ్యవధిలో రెండుసార్లు

మయన్మార్‌ను భూకంపాలు వదలడం లేదు. రెండురోజుల వ్యవధిలో 2 సార్లు భూమి కంపించింది. శుక్రవారం నాడు సంభవించిన భూకంప ధాటి నుంచి జనాలు ఇంకా కోలుకోలేదు.. సహాయక చర్యలు కొనసాగతున్న సమయంలోనే.. నేడు ఆదివారం మధ్యాహ్నం.. మరోసారి మయన్మార్‌లో భూమి కంపించింది. దాంతో జనాలు ఒక్కసారి గా ఉలిక్కిపడ్డారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1గా నమోదైంది. ఇక రెండు రోజుల క్రితం అనగా శుక్రవారం నాడు మయన్మార్‌లో 7.7 మ్యాగ్నిట్యూడ్‌తో సంభవించిన భూకంపం తీవ్ర నష్టం వాటిల్లింది. వందల కొద్ద భవనాలు నెలమట్టం అయ్యాయి. శిథిలాల కింద చిక్కుకుని ఎందరో ప్రాణాలు కోల్పోయారు.. మరేందరో తీవ్రంగా గాయ పడ్డారు. తక్షణమే స్పందించిన ప్రభుత్వం రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభిం చింది. శుక్రవారం నాడు సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 1,644కు చేరు కుంది. 3,408 మంది తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. పలువురు గల్లంతయ్యారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది అంటున్నారు. ఇదిలా ఉండగానే ఆదివారం నాడు మరోసారి మయ న్మార్‌లో భూమి కంపించడంతో జనాలు మరింత భయపడుతున్నారు. మయన్మార్ ప్రభు త్వం చేపట్టిన సహాయక చర్యలు ఆలస్యం అవుతున్నాయి. భూ ప్రకంపలన తీవ్రతకు పెద్ద పెద్ద భవనాలు కుప్పకూలాయి.. రోడ్లు ధ్వంసం అయ్యాయి. కరెంట్, టెలిఫోన్, ఇతర మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. దాంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. ఇక పర్వత ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని.. అక్కడ ఇంకా సహాయక చర్యలు మొదలు కాలేదని సమాచారం. సహాయక చర్యలు ఆలస్యం కావడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు.

నిత్యావసరాల ధరలకు రెక్కలు

భూకంపంతో మయన్మార్‌లో నిత్యావసరాల ధరలకు రెక్కలొచ్చాయి. కరెంటు కోతల నేపథ్యంలో కొవ్వొత్తులకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఫలితంగా రూ.250గా ఉండాల్సిన 10 క్యాండిల్స్ ప్యాకెట్ ధర రూ.450కి పెరిగింది. విద్యుత్తు కొరత కారణం గా.. రోజుకు నాలుగు గంటలు మాత్రమే కరెంట్ సరఫరా చేయనున్నట్లు యాంగూన్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ప్రకటించింది. ఆహారపదార్థాల ధరలకు కూడా రెక్కలొచ్చాయి. ఇక భూప్రకోపంతో విలవిలలాడిన మయన్మార్, థాయ్‌లాండ్‌కు సాయమందించేందుకు అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. భారత్ ఏకంగా 'ఆపరేషన్ బ్రహ్మ' పేరుతో ఆపన్నహస్తం అందిస్తోంది.

క్రికెటర్ షేన్ వార్న్ మృతి కేసు..

వెలుగులోకి కొత్త విషయాలు

ప్రముఖ ఆస్ట్రేలియాన్ క్రికెటర్ షేన్ వార్న్(52) థాయి లాండ్‌లో ఓ విల్లాలో తన స్నేహితులతో ఉన్న క్రమంలో గుండెపోటుతో 2022 మార్చి 4న మరణించాడని అప్పుడు వార్తలు వచ్చాయి. కానీ తాజాగా మాత్రం ఈ కేసు విషయంలో అనేక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన సమాచారం ప్రకారం, వార్న్ మరణానికి గుండెపోటు మాత్రమే కారణం కాదని అంటున్నారు. ఆస్ట్రేలియాకు చెందిన ఓ పోలీస్ అధికారి దీనికి సంబంధించి అనేక విషయాలను బయటపెట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఓ పోలీసు అధికారి ఒక ప్యాటిల్ కమాగ్రా బాటిల్, రక్తం, వాంతుల మచ్చలు కనిపించాయని తెలిపారు. ఈ విషయాలు ఆయన మరణం గురించి అనేక సందేహాలను కలిగిస్తున్నాయి. అయితే, కొద్ది సేపటికి ప్యాటిల్ సీసా తొలగించాలని పై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని ఆయన అన్నారు. కమాగ్రా అనేది అంగస్తంభన చికిత్సలలో ఉపయోగించే ఔషధం. ఈ ఔషధంలో సిల్డెనాఫిల్ సిట్రేట్ ఉంది, ఇది వయాగ్రాలో కూడా కనిపించే పదార్థం. ఆ క్రమంలో డైలీ మెయిల్‌తో మాట్లాడిన పోలీసు అధికారి, సీనియర్ అధికారులు ఆ మాత్రల సీసాను తొలగించమని ఆదేశించారని వెల్లడించారు. ఈ కేసులో ఆస్ట్రేలియాకు చెందిన సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. షేన్ వార్న్ మరణం గురించి అధికారిక నివేదికలో గుండెపోటు కారణంగా మరణించాడని, కానీ దానికి సంబంధించిన ఇతర వివరాలు లేవని తెలుస్తోంది. మరోవైపు కామాగ్రా గురించి ఎవరు ప్రస్తావించలేదు. ఇది కీలకమైన అంశంగా మిగిలిపోయింది. అయితే దీనిని తీసుకున్నాడా లేదా అనేది తెలియలేదు. షేన్ వార్న్, తన స్నేహితులతో కలిసి హాలిడే సమయాన్ని ఎంజాయ్ చేస్తున్న సమయంలో ఈ దురదృష్టకర సంఘటన జరిగింది. మరణం తర్వాత థాని ఆసుపత్రి అందించిన శవపరీక్షలో, వార్న్ సహజ కారణాల వల్ల మరణించాడని, ఎటువంటి అక్రమ సంబంధం లేదన్నారు. అయినప్పటికీ ఈ ఘటనపై ఇంకా అనేక ప్రశ్నలు మిగిలి ఉన్నాయి. షేన్ వార్న్ లాంటి ప్రముఖ వ్యక్తి మరణం, కేవలం గుండెపోటుతోనే జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా అనే విషయాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.

మయన్మార్‌లో మరోసారి భూకంపం

స్విమ్మింగ్‌పూల్లో గజగజ వణికిన ప్రేమ జంట

మయన్మార్‌లో ఆదివారం మరోసారి భూకంపం వచ్చింది. ప్రాణ భయంతో జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. ఇప్పటికే అక్కడ 1,664 మంది మరణిం చగా.. 3,408 మంది గాయపడ్డారు. మయన్మార్, బ్యాంకాక్‌లలో భారీ భూకంపాలు విలయాన్ని సృష్టించిన సంగతి తెలిసిందే. భూకంపం కారణంగా 1,664 మంది మరణించగా.. 3,408 మంది గాయపడ్డారు. మృతులు, గాయపడ్డవారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సోషల్ మీడియాలో భూకంపం తాలూకా వీడియోలు వైరల్‌గా మారాయి. బ్యాంకాక్‌లో భూకంపం సందర్భంగా ఓ పెద్ద బిల్డింగ్ మీద నుంచి నీళ్లు ఎగిసిపడుతున్న దృశ్యాల తాలూకా వీడియో కూడా వైరల్‌గా మారింది. ఆ వీడియోలో మనకు నీళ్లు పైనుంచి ఎగిసిపడుతున్నట్లు మాత్రమే కనిపిస్తుంది. పైన ఏం జరిగిందో తెలీదు. ప్రస్తుతం పైన ఏం జరిగిందో తెలిపే వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఆ వీడియో ప్రకారం.. బిల్డింగ్‌పైన ఓ పెద్ద స్విమ్మింగ్ పూల్ ఉంది. ఆ పూల్‌లో ఓ జంట.. నీటిపై తేలియాడే బెడ్‌షీట్‌పై పడుకుని ఉంది. ఆ ప్రేమికులు ఒకరి ఒడిలో ఒకరు సేద తీరుతున్నారు. కొద్దిసేపటి తర్వాత అలజడి మొదలైంది. వారు మెల్లగా మైకంలోంచి బయటకు వచ్చారు. మొదట వారికి ఏం జరుగుతోందో అర్థం కాలేదు. స్విమ్మింగ్‌పూల్ లోని నీళ్లు పెద్ద పెద్ద అలలుగా కిందకు ఎగిసిపడ్డం మొదలైంది. వెంటనే వాళు అక్కడి నుంచి పైకి వచ్చేశారు. స్విమ్మింగ్‌పూల్‌లోని నీళ్లు పైన ఉన్న వాళ్లపైకి కూడా సముద్రపు అలల్లాగా ఎగసిపడ్డాయి. నీటిపై తేలుతున్న బెడ్‌షీట్లు రెండు పైనుంచి కిందకు పడిపో యాయి. ఒకవేళ ఆ ప్రేమ జంట వాటిపైనే ఉండిఉంటే.. పైనుంచి కిందకు పడేది. ఒక నిమిషం నిడివి ఉన్న వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది.

టోంగాలో భారీ భూకంపం

పసిఫిక్ ఐలాండ్‌లో సునామీ హెచ్చరికలు

టోంగా: మయన్మార్ విలయం వేలాది మందిని పొట్టనపెట్టుకున్న ఉదంతం ఇంకా కళ్ల ముందు ఉండగానే పాలినేషియాలోని ద్వీప దేశం టోంగాలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదైందని యూఎస్ జియాలాజి కల్ సర్వే (యూఎస్‌జీఎస్) ప్రకటించింది. దీంతో పసిఫిక్ ఐలాండ్ నేషన్‌లో సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ భూకంపంలో ఏ మేరకు నష్టం జరిగిందనేది వెంటనే తెలియలేదు. టోంగా ప్రధాన ఐలాండ్‌కు వాయవ్యంగా 100 కిలోమీటర్ల దూరంలో స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున భూకంపం సంభ వించిందని యూఎస్‌జీఎస్ తెలిపింది. దీంతో టోంగా తీరం వెంబడి గంటకు 300 కిలో మీటర్ల వేగంతో ఉధృతంగా పెనుగాలుపు వీచే అవకాశాలున్నాయంటూ పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ హెచ్చరికలు జారీ చేసింది. పాలినేషియా దేశమైన టోంగాలో 171 ద్వీపాలు ఉండగా, లక్ష మందికి పైగా మాత్రమే జనాభా ఉంది. మెజారిటీ ప్రజలు ప్రధాన ఐలాండ్ టోంగటపులోనే నివసిస్తుంటారు. ఇది ఆస్ట్రేలియ కోస్ట్‌కు తూర్పున 3,5000 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ దీవులన్నీ దాదాపు వైట్ శాండ్ బీచ్‌లు గానే ప్రసిద్ధి పొందాయి.

ఉప్పు నీటిలో కరిగే ప్లాస్టిక్ తయారీ

పరిష్కారం కనుగొన్న జపాన్ శాస్త్రవేత్తలు

టోక్యో: సముద్ర జలాల్లో టన్నులకు టన్నులు పేరుకుపోయి అందులోని జీవులతో పాటు మానవ మనుగడకే ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్‌కు పరిష్కారాన్ని కనుగొన్నారు జపాన్ శాస్త్రవేత్తలు. సముద్ర జలాల్లో(ఉప్పునీటిలో) కరిగి పోయే ప్లాస్టిక్‌ను వారు ఆవిష్కరించారు. సుప్రామాలిక్యులర్ అని పిలిచే ఈ వినూత్న ప్లాస్టిక్ సాధారణంగా ఉపయోగిస్తున్నప్పుడు మన్నికగా ఉండి, సముద్రపు నీటిలో కలిస్తే సురక్షితంగా అందులో విచ్ఛిన్నమవుతుంది. జపాన్‌లోని సెమ్స్ శాస్త్రవేత్తలు దీనిని కనుగొన్నారు. పర్యావరణ హితమైంది కావడంతో దీనిని విస్తృతంగా వాడుకలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.

టాయిలెట్‌లో అద్దెకు..

పాపం.. యువతి విచిత్ర జీవితం

ఆమెకు నెలకు 31 వేల రూపాయల జీతం వస్తోంది. అయినా సరే .. ఆమె టాయి లెట్‌లో అద్దెకు ఉంటోంది. దీనిపై నెటిజన్లు మిశ్రమంగా స్పందిస్తున్నారు. కొంత మంది ఆమెను తిడుతున్నారు. అంత డబ్బు వస్తుంటే ఆ పాడు పనేంటి అంటూ మం డిపడుతు న్నారు. ఈ సంఘటన చైనాలో ఆసల్యంగా వెలుగు చూసింది. చైనాలోని హ్యూబే ప్రావిన్స్‌కు చెందిన యాంగ్ అనే యువతికి 18 ఏళ్లు. ఆమె ఓ కంపెనీలో 2,700 యాన్లకు పనిచేస్తోంది. మన ఇండియన్ కరెన్సీలో అయితే ఆమె జీతం 31 వేల రూపాయలు. 31 వేల జీతంతో ఇంటిని రెంటుకు తీసుకోవటం ఆర్థికంగా ఇబ్బంది అవుతుందని ఆమె భావించింది. దీంతో ఆఫీస్‌లోని టాయిలెట్‌లో తక్కువ మొత్తానికే అద్దె కు చేరింది. ఆ టాయిలెట్‌లో ఉండటం కోసం ప్రతీ నెలా 600 రూపాయలు చెల్లిస్తోంది. ఆ టాయిలెట్‌లోనే అన్ని పనులు చేస్తుంది. అక్కడే నేలపై నిద్రపోతుంది. అదే ఆమె ఇళ్లుగా మారిపోయింది. టాయిలెట్ ఇంటికి సంబంధించిన వీడియోను యాంగ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ' టాయిలెట్‌లో ఒంటరిగా జీవించటం భయంగా లేదు. ఆఫీస్‌లో 24 గంటల సర్వేలెన్స్ ఉంటుంది. నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. నేను సేఫ్‌గా ఉంటాను' అని చెప్పుకొచ్చింది. ఆ వీడియోలో.. టాయిలెట్‌లోని ఇండియన్ కమోడ్ గురించి ప్రత్యేకంగా చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యాంగ్ టాయిలెట్‌లో అద్దెకు ఉండటంపై మిశ్రమ స్పందన వస్తోంది. కొంతమంది ఆమె పరిస్థితి చూసి అయ్యో పాపం అంటున్నారు. మరికొందరు మాత్రం తిడుతున్నారు. ' నెలకు 31 వేల రూపాయలు సంపాదిస్తున్నావు. ఓ మంచి ఇంట్లో ఉండలేవా?.. ఏంటి ఈ కర్మ'.. ' డబ్బులు మిగుల్చుకోవడానికి ఈ చెత్త పనులన్నీ చేస్తోంది'.. ' డబ్బుల కోసం కక్కుర్తి పడి ఇలా మరుగుదొడ్డిలో చావాలా?..' అంటూ మండిపడుతున్నారు.

గెలిచే మ్యాచ్‌లో ఓడిన సీఎస్‌కే!

6 పరుగుల తేడాతో రాజస్థాన్ విజయం

ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. రాజస్థాన్ రాయల్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 6 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో సందీప్ శర్మ అద్భుత బౌలింగ్‌తో రాజస్థాన్ రాయల్స్ ఓటమి నుంచి గట్టెక్కి తొలి విజయాన్ని నమోదు చేసింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. నితీష్ రాణా(36 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్స్‌లతో 81) హాఫ్ సెంచరీతో రాణించగా.. రియాన్ పరాగ్(28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. సీఎస్‌కే బౌలర్లలో ఖలీల్ అహ్మద్(2/38), నూర్ అహ్మద్(2/28), మతీష పతీరణ(2/28) రెండేసి వికెట్లు తీయగా.. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులే చేసి ఓటమి పాలైంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(44 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 63) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. రవీంద్ర జడేజా(23 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 34 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. రాజస్థాన్ బౌలర్లలో వానిందు హసరంగా (4/35) నాలుగు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్(1/13), సందీప్ శర్మ(1/42) ఒక వికెట్ పడగొట్టాడు.

మ్యాచ్ టర్నింగ్ పాయింట్..

చివరి 2 ఓవర్లలో సీఎస్‌కే విజయానికి 39 పరుగులు అవసరమవ్వగా.. తుషార్ దేశ్‌పాండే వేసిన 19వ ఓవర్‌లో ధోనీ ఓ బౌండరీతో పాటు భారీ సిక్సర్ బాదగా..ఆఖరి బంతిని జడేజా సిక్సర్ కొట్టి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చాడు. దాంతో ఆఖరి ఓవర్‌లో సీఎస్‌కే విజయానికి 20 పరుగులు అవసరమయ్యాయి. సందీప్ శర్మ వేసిన చివరి ఓవర్ తొలి బంతికి ధోనీ(16) క్యాచ్ ఔటవ్వగా.. జేమీ ఓవర్టన్(11 నాటౌట్) భారీ సిక్సర్ బాది ఉత్కంఠ పెంచాడు.

కానీ సందీప్ శర్మ చివరి రెండు బంతులను కట్టడిగా బౌలింగ్ చేసి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. జోఫ్రా ఆర్చర్‌ను కాదని సందీప్ శర్మతో ఆఖరి ఓవర్ వేయించడం రాజస్థాన్ రాయల్స్‌కు కలిసొచ్చింది. తొలి బంతికే ధోనీ ఔటవ్వడం మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.

మలుపు తిప్పిన క్యాచ్..

రాజస్థాన్ రాయల్స్ స్పెషలిస్ట్ స్పిన్నర్ వానిందు హసరంగా(4/35).. చెన్నై సూపర్ కింగ్స్ పతనాన్ని శాసించాడు. క్రీజులో సెట్ అయిన రాహుల్ త్రిపాఠి(23), రుతురాజ్ గైక్వాడ్(63), శివమ్ దూబే(18), విజయ్ శంకర్(9)లను పెవిలియన్ చేర్చాడు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ స్టన్నింగ్ క్యాచ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. హసరంగా బౌలింగ్‌లో శివమ్ దూబే ఇచ్చిన కష్టతరమైన క్యాచ్‌ను త్రిపాఠి అద్భుతంగా అందుకున్నాడు.

కొంపముంచిన టాపార్డర్..

ఢిల్లీ చేతిలో సన్‌రైజర్స్ ఓటమి!



ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆరెంజ్ ఆర్మీ ఓటమిపాలైంది. వైజాగ్ వేదికగా ఆదివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓటమిపాలైంది. మరోసారి టాపార్డర్ వైఫల్యం సన్‌రైజర్స్ హైదరాబాద్ పతనాన్ని శాసించింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.4 ఓవర్లలో 163 పరుగులకు కుప్పకూలింది. అనికేత్ వర్మ(41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 74), హెన్రీచ్ క్లాసెన్(19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(5/35) ఐదు వికెట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ పతనాన్ని శాసించగా.. కుల్దీప్ యాదవ్(3/22) మూడు వికెట్లు పడగొట్టాడు. మోహిత్ శర్మ(1) ఓ వికెట్ దక్కింది.

అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలోనే 3 వికెట్లకు 166 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఫాఫ్ డుప్లెసిస్(27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీతో రాణించగా.. జేక్ ఫ్రెజర్ మెక్‌గర్క్(32 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38), అభిషేక్ పోరెల్(18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. కేఎల్ రాహుల్(15) విఫలమైనా.. ట్రిస్టన్ స్టబ్స్(14 బంతుల్లో 3 ఫోర్లతో 21 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో జీషన్ అన్సారీ(3/42) ఒక్కడే మూడు వికెట్లు తీయగా.. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు.

మ్యాచ్ టర్నింగ్ పాయింట్..

సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రధాన బలమైన టాపార్డర్ వైఫల్యం ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. అలసత్వంతో అనవసర పరుగుకు ప్రయత్నించి అభిషేక్ శర్మ(1) రనౌటవ్వడం.. ఒకే ఓవర్‌లో ఇషాన్ కిషన్(2), నితీష్ కుమార్ రెడ్డి(0) వెనుదిరగడం.. నిలకడగా ఆడిన ట్రావిస్ హెడ్ కూడా వెనుదిరగడం సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. హెన్రీచ్ క్లాసెన్, అనికేత్ వర్మ ఆదుకునే ప్రయత్నం చేసినా.. ఢిల్లీ బౌలర్లు కుదురుకోనివ్వలేదు. వరుస విరామాల్లో వికెట్లు తీసి ఆరెంజ్ ఆర్మీ పతనాన్ని శాసించారు.

మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్..

ఈ మ్యాచ్‌లో మిచెల్ స్టార్క్.. ఐదు వికెట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ పతనాన్ని శాసించాడు. పవర్ ప్లేలోనే డేంజరస్ ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డితో పాటు ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసిన స్టార్క్..చివర్లో హర్షల్ పటేల్, ఇంపాక్ట్ ప్లేయర్ అయిన వియాన్ మల్దర్(9)ను ఔట్ చేసి కోలుకోలేని దెబ్బతీసాడు.

అన్‌సంగ్ హీరో..

ఈ మ్యాచ్‌తోనే ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేసిన జీషన్ అన్సారీ అన్‌సంగ్ హీరోగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ సానుకూలాంశం ఏదైనా ఉందా? అంటే అది జీషన్ అన్సారీ మాత్రమే. అతను టీమ్ మేనేజ్‌మెంట్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. అతనికి తోడుగా ఇతర బౌలర్లు చెలరేగి ఉంటే మ్యాచ్ మరింత హోరాహోరీగా సాగేది.

వెంకీ నెక్స్ట్ కోసం ఫ్యాన్స్ వెయిటింగ్

విక్టరీ వెంకటేష్ చాలా కాలం తర్వాత భారీ విజయాన్ని అందుకున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మరోసారి తన సత్తా చాటారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. కేవలం తెలుగు మార్కెట్లోనే విడుదలైన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం విశేషం. థియేటర్లకు దూరంగా ఉన్న ఫ్యామిలీ ఆడియన్స్ను తిరిగి తీసుకురావడంలో ఈ చిత్రం కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా వెంకటేష్ వినోదాత్మక నటన, మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ కంటెంట్ ప్రేక్షకులను మెప్పించాయి.

ఈ విజయంతో వెంకటేష్ వెంటనే కొత్త సినిమా ప్రకటిస్తారని అనుకున్నారు. కానీ ఆయన ఓపికగా కథల ఎంపికలో శ్రద్ధ చూపుతున్నారు. సంక్రాంతికి వస్తున్నాం విడుదలై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు కొత్త ప్రాజెక్ట్స్ ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఈ మధ్య దర్శకుడు నందు వెంకటేష్ కోసం ఓ కథను సిద్ధం చేస్తున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే అది ఇంకా చర్చల దశలోనే ఉందని వెంకటేష్ మాస్ ఇమేజ్కు తగ్గ కథను సిద్ధం చేసేందుకు దర్శకుడు మరింత కసరత్తు చేస్తున్నారని తెలుస్తోంది.



మాస్ పోస్టర్తో

'పెద్ది' గ్లింప్స్ డేట్ వచ్చేసింది!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో చేస్తున్న అవైటెడ్ భారీ చిత్రం "పెద్ది" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం నుంచి రీసెంట్ గానే చరణ్ పుట్టినరోజు కానుకగా మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ కూడా రిలీజ్ చేశారు. అయితే ఇక ఈ పోస్టర్స్ తోనే సినిమా గ్లింప్స్ కూడా వస్తుంది అని గట్టి బజ్ వినిపించింది కానీ పలు కారణాలు రీత్యా రాలేదు. ఇక నేడు ఉగాది కానుకగా ఈ గ్లింప్స్ వస్తుంది అని మళ్ళీ వార్తలు వినిపించాయి.

అయితే నేడు గ్లింప్స్ రాలేదు కానీ ఒక అదిరే పోస్టర్ తో గ్లింప్స్ ఎప్పుడు వస్తుందో మేకర్స్ డేట్ ని ఇచ్చేసారు. జెండాలు పట్టుకొని కొందరు గుంపు ఉంటే వారి మధ్యలోకి దూకుతున్న చరణ్ ఇందులో కనిపిస్తున్నాడు. దీనితో ఈ పోస్టర్ ఇపుడు అభిమానులకి మంచి కిక్ ఇవ్వగా ఈ పోస్టర్ తోనే మేకర్స్ ఈ శ్రీరామ నవమి కానుకగా ఈ ఏప్రిల్ 6న ఫస్ట్ షాట్ ని రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ గ్లింప్స్ ఎలా ఉంటుందో వేచి చూడాలి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.



'స్పిరిట్' పై లీక్ ఇచ్చిన సందీప్ వంగ!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా ఇపుడు చేస్తున్న లేటెస్ట్ భారీ చిత్రాల్లో అభిమానులు ఓ రేంజ్లో ఎగ్జైటెడ్గా చూస్తున్న చిత్రం "స్పిరిట్" కూడా ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగ తెరకెక్కించనున్న ఈ సినిమాపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయని చెప్పవచ్చు. ప్రభాస్ లాంటి సాలిడ్ కటౌట్కి సందీప్ రెడ్డి వంగ లాంటి వైలెంట్ దర్శకుడు యాడ్ అయితే ఎలా ఉంటుందో ఈ సినిమాకి చూడబోతున్నాం.

ఇక ఈ సినిమా ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు ఎదురు చూస్తుండగా ఇపుడు ఫైనల్గా ఈ సినిమా షూటింగ్పై ఇంట్రెస్టింగ్ లీక్ని సందీప్ అందించించడం వైరల్గా మారింది. ప్రస్తుతం తాను లొకేషన్స్ రెక్కీలో ఉన్నట్టుగా తెలిపారు. అలాగే షూటింగ్ ని తాను మెక్సికోలో మొదలు పెట్టనున్నట్టుగా లీక్ చేశారు. ప్రస్తుతానికి అయితే డార్లింగ్ ఫ్యాన్స్ కి అప్డేట్ ఇదే అని తెలిపారు. దీనితో మొత్తానికి స్పిరిట్పై ఒక క్లారిటీ అయితే ఫ్యాన్స్ కి వచ్చింది అని చెప్పవచ్చు.

"సర్దార్ 2" ట్రీట్ కి డేట్ ఫిక్స్!

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటించిన పలు సాలిడ్ హిట్ చిత్రాల్లో మన తెలుగులో కూడా భారీ హిట్ అయ్యిన సినిమాలు ఉన్నాయి. మరి అలాంటి చిత్రాల్లో ఒకటే "సర్దార్". దర్శకుడు పిఎస్ మిత్రన్ తెరకెక్కించిన ఈ సాలిడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ కమర్షియల్ గా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఇక దీనికి రెండో భాగాన్ని కూడా మేకర్స్ అనౌన్స్ చేయగా ఇపుడు దీనిపై ఉగాది కానుకగా మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్ అయితే అందించారు.

ఒక అనౌన్సమెంట్ ప్రోమోతో రేపు మార్చ్ 31న సర్దార్ ప్రోలోగ్ ని రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక ఈ ప్రోమోలో అయితే పార్ట్ 1 కట్స్ తో పాటుగా ఇపుడు పార్ట్ 2 కట్స్ కూడా కొన్ని చూపించడం మంచి ఎగ్జైటింగ్ గా ఉందని చెప్పాలి. దీనితో పార్ట్ 2 మరింత గ్రాండ్ గా మరింత యాక్షన్ తో ఉండేలా ఉందని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రంలో ఎస్ జే సూర్య నటిస్తుండగా మాళవిక మోహనన్ నటిస్తుంది. అలాగే ప్రిన్స్ పిక్చర్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

'సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం' అంటున్న మెగాస్టార్

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఇపుడు చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు అనీల్ రావిపూడితో చేయనున్న సాలిడ్ ఎంటర్టైనర్ కూడా ఒకటి. చిరంజీవి కెరీర్లో 157వ సినిమాగా మేకర్స్ ఉగాది పర్వదినం సందర్భంగా అట్టహాసంగా సినిమాని లాంచ్ చేశారు. అయితే వీరి కలయికలో సినిమా ఉంది అనుకున్నప్పుడు నుంచే మంచి బజ్ ఈ చిత్రంపై ఏర్పడింది.

ఇక చిరంజీవిని ఒక సాలిడ్ ఎంటర్టైనర్లో చూసి కూడా చాలా ఏళ్ళు కావడంతో ఈ క్రేజీ కాంబినేషన్ పై మరిన్ని అంచనాలు నెలకొన్నాయి. అయితే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అనీల్ మరియు వెంకీ మామలు అదరగొడితే ఇపుడు చిరంజీవి మాత్రం 'సంక్రాంతికి రఫ్ఫాడిద్దాం' అంటున్నారు. దీనితో తన పోస్ట్ మంచి వైరల్ గా మారింది. సంక్రాంతికి వస్తున్నాం తరహాలోనే మంచి క్యాచీ టైటిల్ గా ఉంది కానీ ఇదైతే టైటిల్ కాదు వచ్చే సంక్రాంతికి రిలీజ్ ని కన్ఫర్మ్ చేసేసారు. ఇక ఈ సినిమాపై మరిన్ని అప్డేట్స్ ఇంకా రావాల్సి ఉంది.